701746



VISALAANDHRA, VIJAYAWADA-4, Phone. 37o
Regd No. H- 20

విశాలాంధ్ర

సంపుటి 14 సంచిక 130] విజయవాడ • 24-7-1964 శుక్రవారం [4 పేజీలు 7 పై.

హైద్రాబాద్ నగరంలో విషమిస్తున్న ఆహారపరిస్థితి

గౌలిగుడా ప్రాంతం చౌకడిపో క్యూలో జరిగిన ఘర్షణలో ఒకవ్యక్తి మరణం

అధికధరల వ్యతిరేక ప్రదర్శనల్లో విరివిగా పాల్గొనండి

వ్యవసాయ, కార్మిక ప్రజానీకానికి రాష్ట్రనాయకులు శ్రీ గోవిందయ్య విజ్ఞప్తి

హైద్రాబాద్, జూలై 18

ఆహారపదార్థాల, తదితర జీవితావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టాలని జరిగే ఆందోళనలో, సభలలో, ప్రదర్శనలలో వేలాదిగా పాల్గొనవలసిందిగా రాష్ట్రంలో వ్యవసాయ కార్మిక ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ ప్రదేశ్ వ్యవసాయ కార్మిక నాయకులు శ్రీ తురిమెళ్ళ గోవిందయ్య గారు నేడొక ప్రకటన చేశారు.

వారా ప్రకటనలో ఇలా అన్నారు:

ఆహార ధాన్యాల ధరలు, ఇతర నిత్య జీవితావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నవి. ధరల పెరుగుదలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయి. ఆహార ధాన్యాల ధరలు, ఇతర నిత్యజీవితావసర వస్తువుల ధరలు అందుబాటులో లేక వ్యవసాయ కార్మికులు, పేదప్రజలు, మధ్య తరగతి ఉద్యోగులు నానా అవస్థల పాలవుతున్నారు. ఆహార ధాన్యాల ధరలు చుక్కలంటాయి. మాగాణి ప్రాంతాలలో నీటి సప్లయి పుష్కలంగా లేనందున వరిపాటలు పాడిపేతగా పోగాయి. దీనిఫలితంగా కూలి రేటు యీ సంవత్సరం అనేక ప్రాంతాలలో బాగా పడిపోయింది. వర్షాలు సకాలంలో లేనందున మెట్ట ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులకు పనులు లేవు. పని దినాలు తగ్గిపోయాయి. దానికి తోడు అధిక ధరలతో పేద సామాన్య ప్రజానీకం అగచాట్ల పాలవుతున్నది. అనేక ప్రాంతాలలో యిప్పటికే పూటవస్తులతో వ్యవసాయ కార్మికులు కాలం గడుపుతున్నారు. కొన్ని ప్రాంతాలలో వరుసగా యీ రెండు సంవత్సరాలలో పంటలు పోయిన ఫలితంగా ఆహారధాన్యాలకొరత ఏర్పడింది. ఆహారపరిస్థితి ముమ్ముందు విషమించనున్నదని వ్యవసాయకార్మిక, పేద ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు.

అందువలన అధికధరలను అరికట్టాలని, ఆహారసమస్యాపరిష్కారానికి ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని, రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేయవలసిన అగత్యముంది. ప్రభుత్వం వెనువెంటనే [illegible] భూస్వాముల, మిల్లర్లు, ధాన్య వ్యాపారులవద్ద నున్న ఆహార ధాన్యాలను సేకరించి గ్రామ గ్రామాన చౌకడిపోలద్వారా ఆహారపదార్థాలను అమ్మించాలని రాష్ట్రవ్యాపితంగా ఆందోళన చేయవలసివుంది.

వడ్డీ లేకుండా అప్పులు

దీనితోపాటుగా ప్రజాతంత్ర ఉద్యమం బలంగావున్న గ్రామాలలో భూస్వాముల నుండి, ఇతర ఆసాములనుండి వ్యవసాయ కార్మికులకు వడ్డీలేకుండా ధాన్యపు అప్పులు ఇప్పించడానికి పూనుకోవలసిన అవసరం ఉన్నది. అలాగే పరపతి సహకార సంఘాలు ఉన్న గ్రామాలలో వ్యవసాయ కార్మికులకు ఇంటి హామీపైగాని, వ్యక్తిగత హామీపైగాని పరపతి సౌకర్యం లభించేటట్లు చూడాలి.

పైన తెల్పినవిధంగా జనరల్ ఆందోళనతో పాటు నిర్దిష్టమైన కార్యక్రమాలలో వ్యవసాయ కార్మిక, పేదప్రజానీకాన్ని సమీకరించి ఆహార సమస్యా పరిష్కారానికి పూనుకోవలసిన అగత్యమెంతగానో వున్నది.

వివిధ స్థాయిలలోగల వ్యవసాయ కార్మిక సంఘాలను పునరుద్ధరించడానికి వెనువెంటనే పూనుకోవాలి. వ్యవసాయ కార్మిక సంఘాలలో పనిచేస్తున్న కార్యకర్తలు సమావేశాలు జరుపుకొని ఆహార సమస్యపై ఆందోళనా కార్యక్రమానికి పూనుకోవలసిందిగా విజ్ఞప్తిచేస్తున్నాను. ఆహారసమస్యపై జరిగే కృషిలో రాష్ట్రంలోని ప్రజాతంత్రవాదులంతా వ్యవసాయ కార్మిక కార్యకర్తలకు చేయూత నివ్వవలసిందిగా కోరుతున్నాను.

ఆహారపదార్థాల ధరలను, ఇతర జీవితావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టాలని, గ్రామ గ్రామాన చౌకడిపోలు పెట్టి చౌకగా ఆహారపదార్థాలు అమ్మాలని జరిపే ఆందోళనలోను, యీ సందర్భంలో జరిగే ప్రదర్శనలు, సభలలోనూ వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మికులను, పేద ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాను."

నాగార్జునసాగర్‌లో మరో ప్రేలుడు

ఇద్దరు బాలురకు గాయాలు

హైద్రాబాద్, జూలై 23

నాగార్జునసాగర్‌లో, తూర్పు పాకిస్తాన్ నుండి వచ్చిన ఇద్దరు శరణార్థి బాలురు నేడు జరిగిన ఒక ప్రేలుడులో గాయపడ్డారు. వారిరువురినీ ఆసుపత్రిలో చేర్చారు.

ఒక క్వారీలో దొరికిన ప్రేలుడు మందు పరికరాన్ని (డెటోనేటర్) ఈ ఇద్దరు బాలురు ఏదో అనుకుని, రాతితో చితకకొట్టడంతో అది పేలిపోయింది. ఈ ఇద్దరు గాయపడ్డారు.

ఇటీవల నాగార్జునసాగర్‌లో జరిగిన పెద్ద ప్రేలుడుకూ దీనికి ఏమీ సంబంధం లేదని పోలీసులు అంటున్నారు.

నాగార్జున సాగర్ ప్రేలుడు ఘటన

సంపూర్ణమైన దర్యాప్తు జరిపించాలని శ్రీ పిల్లలమర్రి విజ్ఞప్తి

హైద్రాబాద్, జూలై 21

నాగార్జునసాగర్‌వద్ద ఇటీవలి ప్రేలుడు ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్ళి చూసి వచ్చిన శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, శాసనసభ్యులు శ్రీ ధర్మభిక్షం, శ్రీ వల్లా పర్వతరెడ్డిగార్లు నేడొక ప్రకటన చేస్తూ అక్కడ సంభవించిన విషాదఘటన భూకంపాన్ని తలపింపజేసిందన్నారు.

ఇలాంటి బీభత్సం ఎన్నడూ జరిగివుండలేదు. నాగార్జునసాగర్ [illegible] అంతా దద్దరిల్లిపో[illegible] ప్రజలంతా భీతిపోయారు.

ఈ దుస్సంఘటనపై సంపూర్ణమైన దర్యాప్తు జరిపించి, ఇక ముందు అలాంటి ఘోరమైన ప్రమాదాలు మరల జరగకుండా జాగ్రత్తలను తీసుకోవాలని వారు ఈ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జులై 25 నుండి శాసనమండలి ఎదుట సత్యాగ్రహానికి నగరకమ్యూనిస్టుసమితినిర్ణయం

(విశాలాంధ్ర విలేకరి)

హైద్రాబాద్, జూలై 23

ఆంధ్ర రాజధాని హైద్రాబాద్ నగరంలో ఆహార పరిస్థితి అత్యంత తీవ్రరూపం ధరిస్తున్నది. బియ్యంధర 30 శాతం పెరిగింది. పంచదార, గోధుమలు మార్కెట్లో అదృశ్యమయినాయి. అవకతవకగా నడుపుతున్నారనే కారణంతో ప్రభుత్వం 12 చౌక డిపోలను మూసివేసింది. వచ్చే 48 గంటలలో 55 కొత్త డిపోలను స్థాపిస్తామనిమాత్రం అంటున్నారు.

గౌలిగుడా ప్రాంతంలో ఉన్న చౌకదుకాణంవద్ద గత రాత్రి నుండి పడిగాపులు పడివున్న క్యూలో, ఇద్దరు వ్యక్తులమధ్య ఘర్షణ జరిగింది. కత్తిపోటు ఫలితంగా ఒక వ్యక్తి మరణించాడు

ప్రభుత్వ ఆహారవిధానానికి నిరసనగా ఈ నెల 25వ తేదీ నుండి శాసనమండలి ఎదుట సత్యాగ్రహం ప్రారంభించాలని నగర కమ్యూనిస్టుసమితి నిర్ణయించింది. అదే రోజున శాసనమండలిలో ఆహారపరిస్థితిపై చర్చ జరుగుతుంది.

నగర కమ్యూనిస్టు నాయకులు శ్రీ కె. యల్. మహేంద్ర నాయకత్వాన ఆరుగురు కమ్యూనిస్టు కార్యకర్తలు ఈ సత్యాగ్రహం ప్రారంభిస్తారు.

అదే రోజున శాసనమండలిలో ఆహార సమస్యపై ప్రతిపక్ష సభ్యులు చర్చ ప్రారంభిస్తారు.

నగరంలోని ఆహార సరఫరా పరిస్థితి తీవ్రంగా పరిణమించింది. చౌకడిపోల దగ్గర ప్రజలు పడిగాపులుపడి ఉంటున్నారు. పరిస్థితి ఎంత విషమంగా ఉందో నేడు గౌలి[illegible]టన ఇట్టే విదితమౌతోంది.

క్యూలో నిలబడిన వారి మధ్య ఘర్షణ-హత్య

గౌలిగుడాలో బియ్యండిపో దగ్గర బ్రహ్మాండమైన క్యూ తయారైంది. రాత్రినుండి వందలాది ప్రజలు వచ్చి క్యూలో పడిగాపులు పడి నిలుచున్నారు. రామిరెడ్డి అనే బండివానికి ఒక పంజాబీ సిక్కుకు మధ్య క్యూలో ఎవరు ముందు నిలబడ్డారనే విషయమై ఘర్షణ ప్రారంభమైంది. ఈ ఘర్షణ పెరిగి చివరకు పంజాబీ సిక్కు రామిరెడ్డిని కత్తితో పొడిచివేశాడు. దాని ఫలితంగా కొంత సేపటికి రామిరెడ్డి మరణించాడు. సిక్కు పారిపోయాడు. పోలీసులు సాయంత్రంలోగా సిక్కును పట్టుకుంటామని చెబుతున్నారు. గాని నేటి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంకా పట్టుబడలేదు.

బ్రహ్మపుత్రానదికి వరదలు

గౌహతి, జూలై 24

బ్రహ్మపుత్రానది నీటిమట్టం గౌహతివద్ద యింకా పెరిగింది.

ప్రమాదస్థాయికి మూడు అడుగుల అయిదు అంగుళాల మేరకు నీటిమట్టం మించింది.

డిబ్రూగర్ వద్ద దిహాంగ్‌నది గత అయిదు రోజులుగా ప్రమాదస్థాయికి రెండు అడుగులు పెరిగింది.

అధికధరలకు నిరసనగా బొంబాయిలో ప్రదర్శనలు:

రేషనింగ్ ప్రవేశపెట్టాలని బీహార్ మంత్రివర్గనిర్ణయం

విజయవాడ, జూలై 23

ఆహారధాన్యాల ధరలకు నిరసనగా బొంబాయిలో హింద్ మజ్దూర్ సభ, హింద్ మజ్దూర్ పంచాయతీల ఆధ్వర్యాన నేడు పెద్ద ప్రదర్శనలు జరిగాయి.

ప్రభుత్వమే టోకు ధాన్య వ్యాపారం చేయాలని, రాష్ట్రమంతటా రేషనింగ్ ప్రవేశపెట్టాలని ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశం సూచించింది. రాష్ట్రవ్యాపితంగా రేషనింగ్ ప్రవేశపెట్టాలని బీహార్ మంత్రివర్గం నిర్ణయించింది.

ఆహార ధాన్యాల, ఇతర జీవితావసర వస్తువుల ధరల పెరుగుదలకు నిరసనగానూ, ప్రభుత్వం వెంటనే తగునివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూనూ బొంబాయిలో నేడు మూడు పెద్ద ప్రదర్శనలు జరిగాయి.

హింద్‌మజ్దూర్ సభ, హింద్ మజ్దూర్ పంచాయత్‌లకు అనుబంధించబడిన కార్మిక సంఘాల నాయకత్వాన ఒక పెద్ద ప్రదర్శనం జరిగింది. ఈ ప్రదర్శనం శాసనసభా భవనం వరకు సాగింది. ప్రస్తుతం శాసనసభా సమావేశం జరుగుతోంది.

తరువాత అచ్చట ప్రదర్శకుల సభలో మాట్లాడిన ఉపన్యాసకులు ధరల పెరుగుదలను అరికట్టడానికి తగిన చర్య ప్రభుత్వం తీసుకోనట్లయితే పరిస్థితి అదుపులో వుండదని, రాష్ట్రవ్యాపితంగా కార్మికులు అన్నిరకాల ఆందోళనలకు పూనుకుంటారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విశాల బొంబాయికి చెందిన టెనెంట్సు అసోసియేషన్‌కుచెందిన 250 మంది అంతకు ముందు శాసనసభముందు ఊరేగింపులపై వున్న నిషేధాన్ని ధిక్కరించి, పోలీసుల నెట్టుకొని అంతకు ముందు ఒకప్రదర్శనం చేశారు. వీరందరిని పోలీసులు అరెస్టుచేశారు. అరెస్టుఅయిన వారిలో ముప్పైమంది స్త్రీలుకూడా ఉన్నారని పోలీసులు తెలియచేశారు.

ధరల పెరుగుదలకు నిరసనగానూ, ఆహార ధాన్యాల పంపిణీలోని అవకతవకల పట్ల నిరసనగానూ దక్షిణబొంబాయికి చెందిన భారతీయ జనసంఘం నాయకత్వాన ఎడతెగని నిరశనదీక్ష నేడు ప్రారంభించారు. మొదటి దళానికి సంఘ కార్యదర్శి నాయకత్వం వహించారు. ఈ దళంలో అయిదుగురు ఉన్నారు. ఫ్లోరాఫౌంటెన్‌వద్ద ఉన్న మృతవీరుల స్తూపంవద్ద, భారీవర్షం కురుస్తున్నా వీరు 24 గంటల నిరశనదీక్ష ప్రారంభించారు.

పౌరసరఫరా శాఖామంత్రి రాజీనామా యివ్వాలని డిమాండ్ చేస్తూ జనసంఘం ఒక పత్రికా ప్రకటనచేసింది. మండలాల విధానాన్ని

(మిగతా 3 వ పేజీలో)

షోలాపూర్‌లో అధికధరలకు నిరసనగా 25 వేలమంది ప్రదర్శన

బ్యాంకులు, ధాన్య వ్యాపారం జాతీయం చేయాలని డిమాండు

షోలాపూర్, జూలై 20

ఈ నెల 19వ తేదీన షోలాపూర్‌లో ప్రజా కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆహార విధానానికి నిరసనగా 25 వేలమంది ప్రదర్శనా, ఊరేగింపూ జరిపారు. త్వరలోనే జిల్లా అంతటా హర్తాళ్ జరపడానికి నిర్ణయించబడింది.

షోలాపూర్‌లో ఆహారధాన్యాలు దొరకడం లేదు. ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం బియ్యం సరఫరాకు ఏర్పాట్లు చేయడం లేదు. దొంగనిల్వలను బయటకుతీయడంలేదు. ఈ పరిస్థితులకు అసమ్మతి తెలుపుతూ ప్రజా కార్యాచరణసమితి నిన్న సాయంకాలం 3 గంటలకు పెద్ద ప్రదర్శన, ఊరేగింపు జరిపింది.

చేనేతకార్మికులు, పవర్‌లూమ్ కార్మికులు, బైండింగ్ కార్మికులు, మిల్లుకార్మికులు వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

లాల్‌బావుటాయూనియన్ ఆఫీసు, దత్తనగర్, భవానీపేట, తయ్యాబౌక మొదలగు ప్రదేశాలనుంచి కార్మికులు ప్రజలు పెద్ద పెద్ద వూరేగింపులుగా బయలుదేరి కార్మిక మైదానంవద్ద చేరారు. అచ్చటినుండి ప్రదర్శనము, వూరేగింపు శివాజీ విగ్రహంవరకు సాగింది.

పొడుగునా వర్షం కురుస్తున్నా, ప్రజలు లెక్కచేయకుండా అధికసంఖ్యలో ఎక్కడికక్కడ వూరేగింపులలో పాల్గొనడానికి వచ్చి చేరారు.

ధాన్యం ధరలు తగ్గాలి, బ్యాంకులు జాతీయం చెయ్యాలి, ధాన్య వ్యాపారం జాతీయం చేయాలి, ధాన్యం ధరలు తగ్గించాలి, లేదా గద్దెదిగాలి, ప్రజలకు భోజనం బంద్ చేస్తే ప్రభుత్వాన్ని బంద్ చేస్తాం, మొదలయిన నినాదాలతో నగరమంతా మార్మోగింది.

శివాజీ విగ్రహం వద్ద జరిగిన సభలో శ్రీ మదూర్, చెన్నూసింహ, కులకర్ణి, జాదవ్, రణశృంగారేగార్లు ఉపన్యసించారు.

ప్రజా కార్యాచరణ సమితి అధ్యక్షులు శ్రీ చెన్నూసింహ ప్రసంగిస్తూ ఆహారసంక్షోభానికి అసమ్మతిగా జిల్లాలో హర్తాళ్ జరుప నిర్ణయించామనీ, ప్రభుత్వ విధానాలను మార్చేందుకు జరుగుతున్న కృషికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి వూరేగింపులలోనూ, బహిరంగసభలోనూ, 25 వేల మంది ప్రజలు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా కమ్యూనిస్టు సమితి

26వతేదీఉదయం 9గంటలకు గుంటూరులో సమావేశం

గుంటూరు, జూలై 23

గుంటూరుజిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశం ఈనెల 26వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు గుంటూరులో పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యాలయంలో జరుగుతుంది. (నిన్న ప్రకటించినట్లు 25వ తేదీన కాదు.)

27, 28 తేదీల్లో రాజకీయ పాఠశాల

కార్యకర్తల రాజకీయపాఠశాల ఈ నెల 27, 28 తేదీల్లో జరుగుతుంది. (నిన్న ప్రకటించినట్లు 26, 27 తేదీల్లో కాదు)

ఈ పాఠశాలకు గ్రామ, పేట కమ్యూనిస్టు శాఖల కార్యదర్శులు, శాఖ కమిటీలున్న చోట్ల కమిటీ సభ్యులు, బ్లాక్ కమిటీ సభ్యులు, పట్టణ కమిటీసభ్యులు తప్పక హాజరు కావాలి. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ సీలం రాజశేఖరరెడ్డి, గుంటూరు జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ యం.యల్.ఏ. ఈ పాఠశాలకు హాజరౌతారు.

కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యదర్శివర్గ సమావేశం

పోటీ పార్టీవారి తెనాలి సదస్సు నిర్ణయాల పరిశీలన

న్యూఢిల్లీ, జూలై 22

భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యదర్శివర్గం నేడిక్కడ సమావేశమైంది. ఈ సమావేశం రెండు రోజులపాటు జరుగుతుంది.

పోటీ పార్టీవారు తెనాలి సదస్సులో చేసిన నిర్ణయాలను నేటి సమావేశంలో పరిశీలించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రసమితి సమావేశానికి హాజరైన శ్రీయుతులు చండ్ర రాజేశ్వరరావు, [illegible] జోషీలు పశ్చిమబెంగాల్ పార్టీ పరిస్థితిని గురించి నేటి సమావేశంలో వివరించారు.

దేశంలోని ఆహార పరిస్థితి, ధరల పెరుగుదల సమస్యపైకూడా కార్యదర్శివర్గ సమావేశం నేడు పరిశీలించినట్లు తెలుస్తున్నది.

జాతీయసమితి సమావేశం ఆగస్టు నెల ప్రారంభంలో జరుగుతుందని భావిస్తున్నారు.

హైద్రాబాద్‌లో గృహిణుల కడగండ్లు

హైద్రాబాద్, జూలై 22

అవకతవకగా నడుపుతున్నారనే కారణంగా నగరంలో వున్న 12 చౌకడిపోలను మూసివేయాలని ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది.

జాయింటు కలెక్టరు శ్రీ వేదవ్యాస్ ఆకస్మాత్తుగా ఈ షాపులను చూడటానికి వెళ్ళారు. కొన్నిచోట్ల ఈ షాపులు పనిచేయడమేలేదు. మరికొన్ని షాపులు వున్నా వాటిల్లో స్టాక్ రిజిష్టర్లు లేవు. మరికొన్ని మరీ అవకతవకగా వున్నాయి.

ఈ మూసివేయాలని ఉత్తర్వు జారీచేసిన షాపుల స్థానాల్లో కొత్త షాపులను ప్రారంభించడానికి అప్పుడే చర్యలను తీసుకోవడం జరిగిందని జాయింటు కలెక్టరు చెప్పారు. వచ్చే 48 గంటల్లోనూ 55 కొత్త చౌకడిపోలను తెరుస్తామనికూడా ఆయన అన్నారు.

గృహిణుల అవస్థ

దాదాపు నిత్య జీవితావసర వస్తువులన్నింటి ధరలు నానాటికి పెరిగిపోతున్నదృష్ట్యా కుటుంబానికి తిండి ఎలా పెట్టాలన్న సమస్య నేడు

(మిగతా 3 వ పేజీలో)

కేంద్ర ప్రభుత్వ నిల్వల నుండి విజయవాడకు స్వల్పంగా బియ్యం సరఫరా

సహకార సంఘాలద్వారా సుమారు 1800 బస్తాల విడుదలకు పర్మిట్లు

విజయవాడ, జూలై 23

విజయవాడలో చౌకదుకాణాలకు బియ్యం సరఫరా ఆగిపోయినందున ఏర్పడిన ఆందోళనకు కన్నీటి తుడుపుగా కేంద్ర ప్రభుత్వం నిల్వలలనుండి 1800 క్వింటాల్సు అక్కుళ్ళు బియ్యాన్ని విడుదల చేయడానికి వివిధ సహకార సంస్థలకు పర్మిట్లు యిచ్చారు.

పట్టణ వినియోగదార్ల సహకార సంఘం స్టోర్సుకు 900 క్వింటాల్సు, కృష్ణాజిల్లా మార్కెటింగ్ ఫెడరేషన్‌కు 450 క్వింటాల్సు, రైల్వే సహకార స్టోర్సుకు 180 క్వింటాల్సు, ఎన్.జి.వో.ల సహకార విక్రయ సంఘానికి 180 క్వింటాల్సు, సిమెంటు ఫ్యాక్టరీ సహకార విక్రయ సంఘానికి 90 క్వింటాల్సు ఈ విధంగా పర్మిట్లు యిచ్చారు.

కృష్ణా కెనాల్ వద్ద ఉన్న కేంద్రప్రభుత్వ గోదాములలో, అవసరమైతే స్థానిక అవసరాలను తీర్చడానికినిల్వచేసిన అక్కుళ్ళబియ్యం స్టాకునుండి ఈ సరుకును విడుదల చేస్తున్నారు. స్థానిక పరిస్థితి దృష్ట్యా ఇంకా మరికొంత సరుకును విడుదల చేయాలని పౌర సరఫరా శాఖవారు కోరినట్లు తెలుస్తూంది.

ప్రభుత్వంచే సరాసరి ధాన్యం కొనుగోలు?

ఇది ఇలా ఉండగా అసలు బియ్యం సరఫరా పరిస్థితిని మెరుగుపరచడానికి ప్రభుత్వం వాళ్లు మిగులు జిల్లాలో సరాసరి ఉత్పత్తి దారుల నుండే ఆహార ధాన్యాలను సేకరించడానికి తగు యంత్రాంగం రూపొందించుతూందని తెలియవస్తూంది.

ఈలోగా కృష్ణాజిల్లా మిల్లరు కలెక్టరు నిర్ణయించిన కిలో 60 పైసలకు తామే స్వయంగా తమ మిల్లులవద్ద బియ్యం అమ్మడానికి నిర్ణయించుకున్నట్లు తెలుపుతున్నారు. అయితే, ఇది నామమాత్రంగానే ఉండగలదనీ, తమకు లభ్యమయ్యే [illegible] సరఫరా చేస్తామనడంవలన పరిస్థితి ఏవిధంగాను కుదుటపడే అవకాశం లేదని భావించబడుతూంది.

సివిల్ సప్లయిస్ జాయింట్ డైరెక్టరు రాక

విజయవాడలోను, కృష్ణాజిల్లాలోను క్లిష్టంగా తయారయిన ఆహారపరిస్థితిని పరిశీలించి తగు చర్యలను తీసుకోడానికి సివిల్ సప్లయిస్‌శాఖ జాయింట్ డైరెక్టరు నేడిక్కడకు రానున్నారు.

అగస్టునెల మొదటి పక్షంలో పాకిస్తాన్ జాతీయ శాసనసభ ప్రతినిధివర్గం సోవియట్‌లో పర్యటించుతుంది.

చౌకడిపోల మూసివేత

పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి నిరసన

విజయవాడ, జూలై 22

విజయవాడ పట్టణ కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి శ్రీ టి. వెంకటేశ్వరరావు ఈ క్రింది విధంగా ప్రకటిస్తున్నారు:

విజయవాడపట్టణంలో గతవారంరోజులనుండి సరసమైనధరలకు బియ్యం అమ్ముతున్న డిపోలు సరుకు సప్లయి లేక మూసివేయబడటంద్వారా అప్పటివరకు కొంతమందికి కిలో 46 పైసలకు, మిగతా వారికి కిలో 60 పైసలకు దొరకు బియ్యం లేకుండా పోవటం మహా దారుణం. రెక్కల కష్టం మీద, నెల జీతాలమీద, ఆధారపడే వేలాది కుటుంబాలు అంతులేని హెచ్చు ధరలు పెట్టి వారి కవసరమైన బియ్యం కొనలేక, పస్తులకు గురికావటం ప్రత్యక్షంగా జరుగుతుంది.

ప్రభుత్వం అవలంబించుతున్న దివాలాకోరు ఆహార విధానమే యీ దుస్థితికి కారణము. ఇట్టి పరిస్థితిని కొనసాగనీయటం సహించరానిది. పరిస్థితులు యింకా విషమించక ముందే, ప్రభుత్వం పట్టణానికి అవసరమైన బియ్యాన్ని సప్లయిచేసి, చౌక దుకాణాల ద్వారా అమ్మించబడటానికి వెనువెంటనే పూనుకోవాలని కోరుతున్నాము.

ఉత్తరవియత్నాంకు యుద్ధవ్యాప్తి?

సైగన్, జూలై 23

గడచిన రెండు వారాలలోనూ దక్షిణ వియత్నాం నౌకా దళాలు ఉత్తర వియత్నాంలోని ప్రధాన పారిశ్రామిక, హార్బరు లక్ష్యాలను ధ్వంసంచేశాయని "సైగన్ పోస్టు" పత్రిక నేడు వ్రాసింది.

హనోయ్ వద్దనున్న హైఫాంగ్ పోర్టులోని ఎర్రదు బ్రిడ్జి యొక్క ఒక చివర భాగాన్ని నౌకా సైనిక దళం పేల్చివేసిందనీ, రమారమి నూరుమంది ప్రజలు చనిపోయారని దక్షిణ వియత్నాం అధికారులు చెప్పుతున్నారు.

ద. వియత్నాం విమాన సైన్యాధిపతి నుగ్యుయెన్ కావోకీ ఒక ప్రకటన చేస్తూ ఉత్తర వియత్నాం విమాన సైనికులు పేరాచూట్లలో దిగినట్లు చెప్పారు.

24 లక్షల ఖర్చుతో మద్రాసు ప్రభుత్వం ఒక సివిల్ సప్లయిస్ ఇన్‌స్పెక్టరేట్ శాఖను నెలకొల్పాలని నిశ్చయించింది.

ధూమపానమునకు, బహూకరించుటకు మంచి ఆహ్లాదకరమైనవి
పనామా
Panama
20
CIGARETTES
Specially blended for a cool and pleasant smoke from selected Virginia Tobacco leaves.
పనామా
ప్రత్యేకతతో చేయబడినవి
గోల్డెన్ టొబాకో కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి - 56
ఇవి చివరి పీల్పువరకూ మంచివి
భారతదేశమందు ఇట్టి పరిశ్రమల్లో పెద్ద స్వదేశీయ సంస్థ
GT. (P) 134 TL
Greens' Advtg.

విశాలాంధ్ర

వియత్నాంలో అమెరికా పన్నాగాలు

ఇండో చైనాలో యుద్ధ విరమణను సాధించేందుకు పదునాల్గు రాజ్యాలు జెనీవా ఒప్పందాన్ని రూపొందించిపదిసంవత్సరాలయింది కాని ఇప్పటికీ ఆశించిన శాంతి మాత్రం లభ్యంకాలేదు. దక్షిణ వియత్నాంలో అమెరికన్ సామ్రాజ్యవాదులు తాము ప్రతిష్ఠించిన తాబేదారీ ప్రభుత్వాన్ని నిలబెట్టడానికి,లావోస్ కంబోడియాల తాటస్థ్యాన్ని వమ్ముచేసి,తనప్రాబల్యం సంపాదించడానికి పెనుగులాడుతూ వుండటమే ఇందుకు ప్రధాన కారణం.

ఐతే, ఈ ప్రాంతాలలో అమెరికా సామ్రాజ్యవాదులు ఎంత ధనాన్ని గుమ్మరించినా, తమ తాబేదారులకు విపరీతంగా మారణాయుధాలను అందించినా, సైనిక సలహాదారులను, నిపుణులను విమాన బలగాలను సరఫరా చేసినప్పటికీ, తామాశించిన ఫలితాలను సాధించలేకపోయారు. దక్షిణ వియత్నాంలో ప్రజలక్రోధానికి గురైన తాబేదారులను మార్చి,మరికొందరిని గద్దె ఎక్కించినా అమెరికన్ పన్నాగాలు ఫలించలేదు. దక్షిణ వియత్నాంలో నాలుగింట మూడు వంతుల భూభాగాన్ని 6,500 గ్రామాలను 90 లక్షల జనాభాను వియట్ కాంగ్ గెరిల్లాదళాలు విముక్తి చేశాయి.

దీనినిబట్టి అమెరికన్ల సాయుధ జోక్యం లేకపోతే దక్షిణవియత్నాంలో తాబేదారీ ప్రభుత్వం ఏనాడో కూలిపోయేదనీ, అంతర్యుద్ధం ముగిసిపోయి, ప్రజలు స్వేచ్ఛాపూర్వకంగా తమ కిష్టమైన ప్రభుత్వవిధానాన్ని, రాజ్యాంగాన్ని ఏర్పరచుకోగలిగే వారని ఇంగితజ్ఞానమున్నవారందరికీ స్పష్టంగా బోధపడుతుంది.

ఐనప్పటికీ ఈ సత్యాన్ని గుర్తించడానికిఅమెరికన్ సామ్రాజ్యవాదులు ఇప్పటికీ తయారు కావడం లేదు. తమ విమాన బలగాలతో మారణాయుధాలతో ప్రత్యక్షజోక్యం ద్వారా ఉత్తర వియత్నాంలోకి యుద్ధాన్ని విస్తరించేందుకు అమెరికా ప్రభుత్వం సన్నాహాలుచేస్తోంది. అమెరికా కొత్త రాయబారి జనరల్ మాక్స్వెల్ టైలర్, సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ విలియం వెస్ట్ మోర్లాండ్ వగైరా కలిసి మిలిటరీ ప్లాన్-దురాక్రమణపథకాన్ని-సంసిద్ధపరచి అమెరికన్ ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. ఆమోదం రాగానే "ఆగ్నేయాసియాలో గందరగోళాన్ని" "కమ్యూనిస్టు ప్రవాహాన్ని" అరికట్టడానికి ఆ పథకాన్ని అమలు జరుపుతారట.

దక్షిణ వియత్నాంలో జాతీయ విముక్తి గెరిల్లా సైనిక దళాలు విజయం పొందడానికి కారణం, ఉత్తర వియత్నాం ప్రభుత్వంనుంచి వారికి వస్తున్న సహాయం, తోడ్పాటే కారణమని అమెరికన్ ప్రభుత్వ ప్రతినిధులు సాకు చెబుతున్నారు. వాటిని అరికట్టే పేరుతో అమెరికన్ విమానదళాలు ఉత్తర వియత్నాం భూభాగంపై గస్తీ చర్యలు జరుపుతాయట; ఫోటోలు తీస్తాయట. దక్షిణ వియత్నాం సైన్యంలో ఇందుకొరకు 600 అమెరికన్ వైమానికులనుచేర్చి, బలపరుస్తారట. ఈ విమానాలు ఉత్తర వియత్నాం గ్రామాలపైన, పారిశ్రామిక కేంద్రాలపైన ముందుగా హెచ్చరిక చేశాక - బాంబులు వేస్తాయనీ, వియట్కాంగ్ గెరిల్లాలు తీసే ప్రతిదెబ్బకూ కసితో ఎదురుదెబ్బ తీసే దృష్టితోనే ఈ పథకం రూపొందించ బడిందనీ యిచివరకే వార్తలు వచ్చాయి.

సైగాన్ రేడియో తాజా వార్తల ప్రకారం దక్షిణ వియత్నాం విమానదళం ఉత్తర వియత్నాంలోని హైఫాంగ్ రేవుకు చెందిన "స్వింగ్" బ్రిడ్జిని ధ్వంసం చేసిందనీ, వందమంది ప్రజలు హతులయ్యారనీ తెలుస్తూంది. అంటే అమెరికన్ల దురాక్రమణ పథకం అమలు జరగడం ప్రారంభమయిందనీ, యుద్ధాన్ని ఉత్తర వియత్నాముకు విస్తరించు తున్నారనీ ద్యోతక మవుతుంది.

యావత్తు "ఇండో-చైనా" జాతీయ స్వాతంత్ర్యోద్యమమంతటికీ నాయకత్వం వహించిన హోచిమిన్ అధ్వర్యాన ఉత్తర వియత్నాంలో ప్రజా ప్రభుత్వం పరిపాలిస్తోంది. ఫ్రెంచి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి, జాతీయ నాయకులైనవారే ఉత్తర వియత్నాంలో ప్రభుత్వాధినేతలుగా వున్నందున గతపది సంవత్సరాల కాలంలోనూ అచటి ప్రజాపరిపాలన సాధించిన పారిశ్రామికాభివృద్ధిని, ప్రజాభ్యుదయాన్ని ప్రత్యక్షంగాచూస్తున్న, దక్షిణవియత్నాం, కాంబోడియా, లావోస్ ప్రజానీకానికి సహజంగానే తమకు సైతం అలాంటి ప్రభుత్వం కావాలనే ఆకాంక్ష వుంటుంది. ముఖ్యంగా అమెరికన్ తాబేదారుల దౌర్భాగ్యపరిపాలన అనుభవించిన దక్షిణ వియత్నాం ప్రజానీకం అందుచేతనే వియట్ కాంగ్ గెరిల్లా దళాలకు తోడ్పడుతున్నారు. జాతీయ విముక్తిదళాల పురోగమనానికి, విజయాలకు ప్రధాన కారణమదే.

ఈ వాస్తవాన్ని గుర్తించడానికి ఇష్టంలేక దక్షిణ వియత్నాంలోని తమ తాబేదార్ల ఘోర పరాజయాలను అమెరికన్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగకరమైనవిగా ఎంచడం, వియత్నాం అంతర్యుద్ధంలో తమ బలగాలతో ప్రత్యక్షమిలిటరీ జోక్యానికి సిద్ధపడటం శుద్ధతప్పుకాగలదు. ఉత్తరవియత్నాంకు యుద్ధాన్ని విస్తరింపచేయడం ద్వారా అమెరికా ప్రభుత్వం మూడవ ప్రపంచ యుద్ధాన్ని రెచ్చగొట్టే ప్రమాదం వుంది.

అమెరికా దుష్ట పన్నాగాలను నిరసించుతూ చైనా ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వం అమెరికా జోక్యాన్ని సహించబోమని హెచ్చరించింది. జెనీవా ఒప్పందానికి బాధ్యులైన పద్నాలుగు రాజ్యాలు తిరిగి సమావేశం కావాలనీ, ఆగ్నేయాసియాలో ఉద్రిక్తతను సడలించేందుకు, శాంతియుత సంప్రదింపులద్వారా ప్రయత్నించాలనీ సోవియట్ ప్రభుత్వం పదేపదిగా హెచ్చరించుతోంది.

ప్రపంచ శాంతిని కాంక్షించే వారంతా, అమెరికా పన్నాగాలను నిరసించుటేగాక వియత్నాం అంతర్యుద్ధంలో జోక్యాన్ని కట్టిపెట్టాలని హెచ్చరించాలి. లావోస్ వగైరా సమస్యల పరిష్కారానికి 14 రాజ్యాల సమావేశాన్ని తక్షణమే పిలవాలనీ, ఇందుకొరకు ఐక్యరాజ్య సమితి కార్యదర్శి యూథాంట్ వెంటనే పూనుకోవాలని ఎలుగెత్తి చాటాలి.

రైల్వే ట్రయిన్ ఎగ్జామినర్ల వేతనాల హెచ్చింపు

న్యూఢిల్లీ, జూలై 22

రైల్వే ట్రయిన్ ఎగ్జామినర్ల వేతన స్కేలును రు. 180-240 నుండి రు. 180-280లకు పునర్నిర్ణయించి దానికి రైల్వేబోర్డు అంగీకరించింది.

అఖిలభారత రైల్వేపనివారల ఫెడరేషనుకూ రైల్వేబోర్డుకూ మధ్య నిన్న జరిగిన ఒప్పందాన్ని అనుసరించి పై నిర్ణయం జరిగింది.

గ్యారంటీ వేతనాలు లేకుండా కమిషన్ ప్రాతిపదికపై జీతాలు చెల్లించే రైల్వే రెస్టారెంట్ కారుల్లో పనిచేసేవారికి, 70 రూపాయల జీతమూ, ఇతర అలవెన్సులూ గల రైల్వే ఉద్యోగులతో సమానంగా నెలసరి రాబడిఉండే విధంగా చూడడానికిగూడ రైల్వేబోర్డు అంగీకరించింది. ఇతర రైల్వే ఉద్యోగులకు కల్పిన ఇతర హక్కులుకూడ వీరికి సంక్రమిస్తాయి.

బ్రెయిన్స్ గుమాస్తాలను గార్డులుగా ఇకోటికంగా ప్రమోట్చేసే విషయమై కూడా రైల్వే పనివారల ఫెడరేషన్కూ, రైల్వే బోర్డుకూ మధ్య ఒప్పందం కుదిరింది.

ప్రస్తుతం మోటార్మెన్ వేతనాల విషయంలో ఉన్న లోపాలను తొలగించడానికి కూడా రైల్వేబోర్డు అంగీకరించింది.

రైల్వే పనివారల ఫెడరేషన్కూ, రైల్వే బోర్డుకూ మధ్య ఆక్టోబరు 15 వ తేదీన తిరిగి సమావేశం జరుగుతుంది.

కేంద్ర సహాయమంత్రిగా శ్రీ టి. యన్. సింగ్ నియామకం

న్యూఢిల్లీ, జూలై 22

ప్రణాళికా సంఘ సభ్యుడు శ్రీ టి. యన్. సింగ్ కేంద్రమంత్రి వర్గంలో పరిశ్రమల సప్లయిశాఖ సహాయ మంత్రిగా నియమించబడినట్లు రాష్ట్రపతి భవనంనుండి నేడొక పత్రికా ప్రకటన వెలువడింది. శ్రీ సింగ్ [illegible] శాఖలను చూస్తారు.

సింగ్ ప్లానింగు కమిషన్ సభ్యుడు. వీరు పరిశ్రమల బాధ్యత నిర్వహిస్తుండేవారు.

1958 వరకు శ్రీ సింగ్ పార్లమెంటు సభ్యుడుగా వున్నారు. తర్వాత ప్లానింగు కమిషన్లో సభ్యుడుగా చేరారు. పార్లమెంటు పబ్లిక్ ఎకౌంట్సు కమిటీకి అధ్యక్షుడుగా వుండేవారు.

1904 ఆగస్టు 8 వ ఉత్తరప్రదేశ్లో జన్మించారు. హరిశ్చంద్ర హైస్కూలులో విద్య పూర్తిచేసిన పిదప బెనారస్లోని కాశీ విద్యాపీఠంలో ఆర్థిక శాస్త్రాన్ని ప్రత్యేకంగా పఠించారు.

మహాత్మా గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనేందుకు 1921లో విద్యకు స్వస్తి చెప్పారు. కొద్దికాలం శ్రీ సింగ్ను నిర్బంధంలోవుంచి విడుదలచేశారు.

1931 లోనూ, 42 లోనూ సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు శ్రీ సింగ్ ఖైదు చేయబడ్డారు.

'నేషనల్ హెరాల్డు' పత్రికకు ఉపసంపాదకుడుగా పనిచేశారు. ప్రెస్ కమిషన్ సభ్యుడుగా కొన్నాళ్లు ఉన్నారు.

కేంద్ర పరిశ్రమల, సరఫరాశాఖలో కాబినెట్ హోదా మంత్రిగా శ్రీ దాసప్ప నియమితులైన విషయం పాఠకులకు విదితమే.

సింగపూర్లోని మలయా-చైనా జాతీయుల మధ్య జరిగిన కొట్లాటలో యింతవరకు 14 మంది చనిపోయారు. వందమంది గాయపడ్డారు.

ఈజిప్టు విప్లవం 12వ వార్షికోత్సవం

కైరో సభలో ఆఫ్రికన్ నాయకుల అభివందనలు

నీరట్, జూలై 22

ఆఫ్రికా ఐక్యతా సంస్థను ఆఫ్రికనులందరూ బలపరచాలనీ, ఆ సంస్థద్వారా ఆఫ్రికన్ నాయకులు ఆఖండం యొక్క భవిష్య దభివృద్ధికి కలిసి ఒక పథకం ప్రకారం పనిచేయగలరనీ నేటిరాత్రి కైరోలో కీన్యా ప్రధాని జోమో కెన్యాటా అన్నారు.

ఈజిప్టులో ఫరూక్ రాజరికాన్ని తొలగించిన విప్లవంయొక్క 12 వ వార్షికోత్సవ సందర్భంగా రిపబ్లిక్ స్క్వేర్లో జరిగిన పెద్ద సభలో ఆయన ప్రసంగించారు.

ఆఫ్రికను అగ్రనాయకుల సభ నిన్నటితో కైరోలో ముగిసింది. ఆ సభకు వచ్చిన నాయకులలో కెన్యాటా ఒకరు. ఆయన నేడు జరుగుతున్న వుత్సవాలలో పాల్గొనేటందుకే కైరోలో వుండిపోయారు.

సభలో ఆయన ప్రసంగిస్తూ కీన్యాలో తాము విప్లవం నడిపిన ఏడాదే ఈజిప్టులోకూడ విప్లవం వచ్చిందనే విషయాన్ని గుర్తుచేశారు.

కొరాన్ పద్యపఠనంతో సభ ప్రారంభమయింది. ఐక్య అరబ్ రిపబ్లిక్ ఉపాధ్యక్షుడు హుస్సేన్ ఎల్షాఫీ ఆఫ్రికా నాయకులకు స్వాగతం పలికారు.

ఇథియోపియా చక్రవర్తి హెయిలీ సెలాసీ ఈజిప్టు ఆర్థికంగానూ, పారిశ్రామికంగానూ, సాధించిన అభివృద్ధిని కొనియాడేరు.

గినీయాఅధ్యక్షుడు సెకూటూరే "ఆఫ్రికాలో వచ్చే ప్రతి వుద్యమానికి విప్లవానికి ఈజిప్టు విప్లవం ఆకాశదీపం" వంటిది. అని వర్ణించారు.

అల్జీరియను ప్రజలూ, ప్రభుత్వమూ సామ్రాజ్యవాదవ్యతిరేకపోరాటంలో ఐక్యఅరబ్ రిపబ్లిక్కు పక్షననే నిలబడి, అదే పంథా ననుసరిస్తారని అల్జీరియా అధ్యక్షుడు బెన్బెల్లా అన్నారు.

మలావీ ప్రధాని డాక్టర్ హేస్టింగ్స్బాండా ప్రసంగిస్తూ సహారాకు దిగువన, ఎగువనవున్న ఆఫ్రికా ఖండం ఈ నాటికి ఒకటి కాగలిగిందన్నారు.

ఈజిప్టు ప్రజల పురోగతికై అధ్యక్షుడు చేసిన కృషి ఆయన "మహావ్యక్తి" వినయానికి మూర్తిమంతం చేసిందని అన్నారు.

కార్మికులకు పొదుపు పథకం

కార్మిక సభలో చర్చాంశం

న్యూఢిల్లీ, జూలై 22

జూలై 29, 30 తేదీలలో బెంగుళూరులో జరుగనున్న భారత కార్మిక సభలో ఇతర విషయాలతోపాటు కార్మికుల వేతనాలలోనుండి పొదుపు చేసుకునే పథకాన్ని గురించి కూడా ఆలోచిస్తారు.

ఉద్యోగస్థుల అనుమతితో వారివేతనాలలో కొంత మొత్తాన్నికూడ [illegible].

ఈ పథకం క్రింద 162 గ్రూపులు పని చేస్తున్నాయి. సభ్యుల సంఖ్య 6, 45,000 ఉంది.

గత మార్చి 11 వరకు ఈ పథకం క్రింద ప్రతి నెల 35 లక్షల రూపాయలవరకువసూలు చేయబడ్డాయి. అధికారుల సహాయంతో కార్మికుల పొదుపును అభివృద్ధి చేసే కోటానికి ఈ పథకం ఉద్దేశించబడింది. ఈ విధంగా పొదుపుచేయబడిన ధనాన్ని జాతీయ అభివృద్ధి పథకాలకై వినియోగిస్తారు. భవిష్యత్తులో కార్మికుల సంక్షేమానికై ఈ పొదుపు ధనం వినియోగపడుతుంది.

అల్జీర్స్ సమీపంలోని ఆయుధ గిడ్డంగి వద్ద బుధవారంనాడు జరిగిన ప్రేలుడు ప్రమాదంవలన నలుగురు చనిపోయారు.

భారత కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమ ముసాయిదా - 5

జాతీయ ప్రజాస్వామిక ఐక్య సంఘటన స్వరూప, స్వభావాలు

కమ్యూనిస్టుపార్టీ కార్యక్రమం ముసాయిదాలోని ఎనిమిదవ అధ్యాయంలో, పెట్టుబడిదారేతర పంథాలో భారతదేశం ఆర్థికాభివృద్ధిని సాధించి, సోషలిస్టు పరివర్తనకు పరిస్థితులను పరిపక్వమొనర్చే జాతీయ ప్రజాస్వామ్యం, జాతీయ ప్రజాస్వామిక ఐక్య సంఘటనల స్వరూప స్వభావాలను వివరించారు. ఆ అధ్యాయాన్ని నేడు ప్రకటిస్తున్నాము.

VIII

జాతీయ ప్రజాస్వామికవిప్లవం-భవిష్యత్తుకు ఉత్తమ మార్గం

73. జాతీయ ప్రజాస్వామిక విప్లవాన్ని పూర్తిచేయడానికి, పాత సామ్రాజ్యపరిపాలన అవశేషాలను పూర్తిగా నిర్మూలించడానికి, పరిశ్రమలను, వ్యవసాయాన్ని త్వరితంగా అభివృద్ధి చేయడానికి, నిరుద్యోగ రాక్షసిని రూపుమాపడానికి, ప్రజల ఆదాయాలను జీవన ప్రమాణాలను పెంచడానికి, ప్రజల సంస్కృతిని పెంపొందించడానికి, ఆనందదాయకమైన ఉజ్వలభవిష్యత్తు వైపు దేశాన్ని ముందుకు తీసుకుపోవడానికి ఇండియా ఏ పథాన్ని ఎంచుకోవాలి?

ప్రస్తుతం ఇండియా అనుసరిస్తున్న పెట్టుబడిదారీ అభివృద్ధి పథాన్ని వదలిపెట్టనంతకాలం, మన ప్రజలు దోపిడీనుండిగాని, దారిద్ర్యంనుంచి, [illegible]నుండిగాని విముక్తి కావడంకల్లయని జీవితానుభవం చాటిచెబుతున్నది.

74. సత్వరాభివృద్ధికోసం, ఉజ్వల జీవితం కోసం ప్రజలు పరితపిస్తున్నా రనడానికి సోషలిస్టు భావాలు ప్రజలను అమితంగా ఆకర్షిస్తుండడమే ప్రబల నిదర్శనం. సోషలిజం సాధిస్తున్న ఆర్థిక, తదితర ఘనవిజయాలు చూసి ప్రజలు ముగ్ధులవుతున్నారు. ఆ విధంగా సోషలిజం మన ప్రజలపై తన ప్రభావాన్ని ప్రసరింపచేస్తున్నది. మన ప్రజల మనస్సులను తీవ్ర భావాలతో ఉద్దీప్తం చేస్తున్నది. ఈ నాడు చివరకు బూర్జువా రాజకీయవేత్తలు సైతం సోషలిస్టు నినాదాలను చేపట్టక తప్పడంలేదు. అందులో ఆశ్చర్యపడవలసినదేమీలేదు. పాలకపక్షమైన కాంగ్రెసు "సోషలిస్టు రాజ్య" స్థాపనే తన లక్ష్యమని ప్రకటించుకొనే దాకా వెళ్లింది.

75. మనం ఈనాడు ఎదుర్కొంటున్న సమస్యలవంటి వాటినే సోషలిజం జయప్రదంగా పరిష్కరించిన ఆదర్శం ధ్రువతారలై వెలుగొందుతుండడం, భారతదేశ సత్వర పారిశ్రామికీకరణకు సత్వరాభివృద్ధికి సోషలిస్టు దేశాలనుండి బహుముఖమైన ఆర్థికమైన సహాయంపొందడానికి అవకాశంఏర్పడటంపెట్టుబడిదారీ విధానం మొత్తంమీద అప్రతిష్ఠపాలు కావటం, ఆ విధానంవల్లమనప్రజలు స్వయంగా బాధాకరమైన అనుభవాన్ని పొందివుండటం, సోషలిస్టుభావాలవైపు ప్రజలు అధికాధికంగా ఆకర్షితులవుతుండటం, ప్రజాస్వామికోద్యమం అభివృద్ధిచెందడం, జాతీయ రాజకీయ జీవనంలో కార్మికవర్గపాత్ర అంతకంతకు అధికం కావటం ఈ విషయాలన్నింటినిబట్టి మనదేశం పెట్టుబడిదారేతర, ప్రజాస్వామికపద్ధతులలో అభివృద్ధి చెందడానికి దేశంలోపల, వెలుపల పరిస్థితులు అనుకూలంగా వున్నట్టు స్పష్టమవుతున్నది.

విదేశీ గుత్తాధిపతుల ప్రాబల్యాన్ని నిర్మూలించడానికి, దానితోపాటు దేశీయ గుత్తాధిపతులను అరికట్టడానికి, సమూలమైన వ్యవసాయ సంస్కరణల కోసం, మన సామాజిక, రాజకీయ జీవితంలో సమూలమైన మార్పుల కోసం సంకల్ప సిద్ధులైన అసంఖ్యాక జనసామాన్యం పోరాటాలలో ఇప్పటి కప్పుడే సమీకృతులయ్యారు.

76. పెట్టుబడిదారీ సంక్షోభవ్యాధి సోకని సిసలైన సోషలిస్టు సమాజాన్ని శాస్త్రీయమైన, విశ్వజనీన సత్యాత్మకమైన మార్క్సిజమ్ లెనినిజాన్నిభారతదేశ పరిస్థితులకు అన్వయించడం ద్వారా మాత్రమే నిర్మించగలమని కమ్యూనిస్టు పార్టీ నమ్ముతున్నది.

ప్రధాన ఉత్పత్తి సాధనాలపైన, మారకం పంపిణీలపైన, సామాజిక యాజమాన్యం, కంట్రోలు, నిర్వాహణాధికారం ఏర్పడ్డం, కార్మికవర్గ నాయకత్వాన కార్మిక కర్షక, మధ్యతరగతి ప్రజల రాజ్యం స్థాపించబడటం-ఇవే సోషలిజానికి ప్రాథమికమైన గీటురాళ్ళు. భవిష్యత్తులో భారతదేశంయొక్క ఆర్థిక, రాజకీయాభివృద్ధి ధ్యేయం ఇదేనని భారత కమ్యూనిస్టు పార్టీ ఎలుగెత్తి చాటుతున్నది. కార్మిక రాజ్యస్థాపనకు, సోషలిస్టు పరివర్తనను పూర్తిచేయడానికై సిసలైన, పరిపుష్టమైనప్రజాస్వామ్యం స్థాపించడానికి కమ్యూనిస్టు పార్టీ కష్టజీవులకు నాయకత్వం వహిస్తుంది.

77. ఇండియా సోషలిస్టు పథం చేపట్టడానికి, సోషలిస్టు సమాజ నిర్మాణం ప్రారంభించడానికిముందుసామ్రాజ్యవ్యతిరేక ఫ్యూడల్ ప్రతికూల, ప్రజాస్వామిక విప్లవ దశను దాటవలసి వుందన్నవిషయాన్ని గుర్తుంచుకోవాలి. జాతీయ ప్రజాస్వామిక విప్లవం సాధించవలసిన ప్రధానకర్తవ్యాలేమిటో పూర్వ అధ్యాయంలో సవివరంగా పొందుపర్చాం.

78, అయితే, జాతీయ బూర్జువా వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం, పెట్టుబడిదారీ అభివృద్ధి పథంలో స్వతంత్ర జాతీయ ఆర్థిక వ్యవస్థను పెంపొందించాలన్న విధానాన్ని పాటిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలుజరుపలేదు.

ఇంతకుముందు అధ్యాయాలలో మేము వివరించినట్లు, పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాలోని అంతర్గత సంఘర్షణలు, వైరుధ్యాల కారణంగా, అతి స్వల్పమైన అభివృద్ధి వేగం, ఎదుగూ, బొదుగూలేని వ్యవసాయం, ఆదాయాలలో అధికమవుతున్న వ్యత్యాసాలు, అంతకంతకు దిగజారిపోతున్న జనసామాన్య జీవన ప్రమాణాలు మన దేశానికి దాపురించాయి. వీటితోపాటు, గుత్తాధిపత్యపు గ్రూపుల ప్రాబల్యం పెచ్చు పెరిగిపోతున్నది. ఫ్యూడల్ శక్తులతో కలిసి, విదేశీ గుత్తపెట్టుబడితో బ్రహ్మముడి వేసుకొన్న దేశీయ గుత్తాధిపత్యపు గ్రూపులు భారతదేశ స్వతంత్ర ఆర్థికాభివృద్ధికే తీరని ప్రమాదం తెచ్చిపెడుతున్నాయి.

కాబట్టే మన దేశ శ్రామిక ప్రజానీకంలో అంతకంతకు అధికాధిక సంఖ్యలో ఈ క్రింది ప్రశ్న వేస్తున్నారు. పెట్టుబడిదారీ పథం వెంట ఇండియా పయనించవలసిందేనా? అది తప్ప మరొక మార్గం లేదా? మేము దేశం ముందుంచుతున్న ఈ కార్యక్రమం ప్రత్యామ్నాయమైన అభివృద్ధి పథకాన్ని సూచిస్తున్నది.

79. ఈ పథం వెంట అభివృద్ధి కొనసాగుతున్న కొద్దీ తక్షణం తలపెట్టవలసిన దాడి, నిర్మూలనల లక్ష్యం, పెట్టుబడిదారీ విధానం గాని, పెట్టుబడిదారీ సంబంధాలుగాని కాబోవు.

మొట్టమొదట ముఖ్యంగా మన ఆర్థిక వ్యవస్థపై విదేశీ గుత్తపెట్టుబడికి గల పట్టు పూర్తిగా నిర్మూలించబడుతుంది.

రెండవ అంశంగా విదేశీ గుత్తాధిపత్య సంస్థలతో ఏ విధంగాను ప్రమేయంలేని స్వతంత్రమైన, ప్రజాస్వామిక ప్రాతిపదికపై నిర్మాణమవడమే ప్రభుత్వరంగాన్ని విస్తరింపచేసి, పటిష్టవంతం కావించి స్వయం పోషకమైన జాతీయ పరిశ్రమను, ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి, దానిని శక్తివంతమైన సాధనంగా మారుస్తాం.

మూడవ అంశంగా, భారతీయ గుత్తాధిపత్యపు గ్రూపులను గట్టిగా అరికట్టి వాటి ఆర్థిక శక్తిని బద్దలు చేస్తాం.

నాల్గవ అంశంగా, భూస్వాముల, ఫ్యూడల్ అవశేషాల శక్తిని పూర్తిగా నిర్మూలిస్తాము. రైతాంగ ప్రయోజనాలకు అనువైన రీతిలో సమూలమైన వ్యవసాయ సంస్కరణలు అమలు జరుపుతాము. మన వ్యవసాయ రంగం పాలిట జలగలై పీడిస్తున్న వడ్డీ వ్యాపారపు, వాణిజ్యపు, బ్యాంకు పెట్టుబడి పట్టును బద్దలు చేస్తాము.

దీనివల్ల, అతి ముఖ్యమైన సంస్కరణల ద్వారా, పరిశ్రమ, వ్యవసాయాలలోని ఉత్పత్తి శక్తుల శృంఖలాలను ఛేదించి, సత్వర ఆర్థికాభివృద్ధిని సాధించి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచి,వారు ఉత్పత్తిలో ఉత్సాహంతో పాల్గొనేటట్టు చేసే అభివృద్ధి పథం మన ప్రజల ముందు ప్రత్యక్ష మవుతుంది. మన దేశాన్ని తరువాత దశలో సోషలిజానికి దారితీసే పథంలో పెట్టడానికి అవసరమైన పూర్వరంగం దీనివల్ల సృష్టించబడుతుంది. మధ్యలో వచ్చే ఈ దశను పెట్టుబడిదారేతర అభివృద్ధి దశగా మనం నిర్వచించ వచ్చు.

80, ఈ కార్యక్రమాన్ని అమలు జరపడానికి ఆసక్తి కలిగియున్న వర్గాలు ఏవి ?

ఒకటి : మొట్టమొదటిది. కార్మికవర్గం ఈ కార్యక్రమాన్ని పూర్తిగా, అచ్చింతంగా అమలు జరిపేందుకు ఆ వర్గం నడుంబిగిస్తుంది. ఇప్పటికప్పుడే ఆ వర్గం ఈ కార్యక్రమంలోని కొన్ని అంశాలను అమలు జరపాలని అందోళనచేస్తూ దేశవ్యాప్తమైన కార్యాచరణను ప్రారంభించింది.

రెండు : స్వయంగా సేద్యంచేసే అశేష రైతాంగం. ఇందులో ధనిక రైతులు, వ్యవసాయకూలీలు వుంటారు. ఈ కార్యక్రమంలో పేర్కొన్న సమూలమైన వ్యవసాయ సంస్కరణలు, తదితర ప్రజాస్వామిక సంస్కరణలు పూర్తి చేస్తే, స్వయంగా సేద్యం చేసే రైతాంగం యొక్క ఉత్పత్తి శక్తులను బంధిస్తున్న శృంఖలాలు ఛేదించ బడతాయి. భూమిలేని రైతులకు, వ్యవసాయ కూలీలకు చేతినిండా తగినంత పని దొరుకుతుంది, వ్యవసాయోత్పత్తి, గ్రామీణ ప్రజల జీవనప్రమాణం క్రమేణా వృద్ధిచెందుతాయి.

మూడు : పట్టణాలలోను, గ్రామాలలోను తలెత్తుతున్న మేధావివర్గం. ఈ వర్గం నిరుద్యోగంతోనూ, దారిద్ర్యంతోనూ బాధపడుతున్నది. ప్రస్తుత పరిస్థితిలో విద్యాసౌకర్యాలు, సాంస్కృతికాభివృద్ధికి అవకాశాలు తగినంతగా లేకపోవటంతో ఈ వర్గం విపరీతంగా విసుగుచెందివుంది.

కడకు, జాతీయబూర్జువావర్గం, ఇందులో అగ్రగుత్తాధిపత్యపువర్గాలుచేరవు. ఈ వర్గాలను మినహాయించగా, మిగతా జాతీయబూర్జువా వర్గం సామ్రాజ్యవ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక విప్లవంలోని ప్రధాన కర్తవ్యాలను పూర్తి చేయాలని కాంక్షిస్తున్నది. ఈ కర్తవ్యాలపూర్తి చేయనిదే, నిజమైన స్వతంత్ర జాతీయ ఆర్థిక వ్యవస్థను నిర్మించడంగాని, [illegible] దారిద్ర్యాన్ని నిర్మూలించడం గాని సాధ్యం కాదని ఆ వర్గానికి తెలుసు. అయితే, ప్రస్తుత సమాజంలో ఇది దోపిడీవర్గం కూడా కావటం వల్ల, దీని స్వభావం ద్వంద్వాత్మకంగా వుంటుంది. ఒక వైపున తన సొంత ప్రయోజనాలకోసం మన ఆర్థిక వ్యవస్థనుంచి సామ్రాజ్యవాద ప్రాబల్యాన్ని, ఫ్యూడల్ అవశేషాలను నిర్మూలించడానికి కృషి చేస్తూనే, మరొక వైపున ఊగిసలాటలను ప్రదర్శిస్తూ, ఈ శక్తులతో రాజీ పడడానికి సిద్ధమవుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ వుంటుంది.

ఈ సందర్భంలో ఒక విషయం గమనించడం ముఖ్యం. మేము ఇంతకుముందే వివరించినట్లు, పెట్టుబడిదారీ అభివృద్ధి మూలంగా జాతీయ బూర్జువావర్గంలోనే కొంత వ్యత్యాసం బయలుదేరింది. బలీయమైన గుత్తాధిపత్యపు గ్రూపులు తలెత్తాయి. ఈ గ్రూపులు పాలకపక్షమైన కాంగ్రెసు వెలుపలగల అభివృద్ధి నిరోధక పక్షాలతోను, కాంగ్రెసులోని మితవాద శక్తులతోను కలిసి, జాతీయ విధానాలను తారుమారు చేయాలని చూస్తున్నాయి. ఈ గ్రూపులు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే జాతీయ బూర్జువావర్గంలోని అత్యధికభాగం ప్రయోజనాలు దెబ్బతింటాయి.

81. ఆ విధంగా, ఈ కార్యక్రమాన్ని అమలు జరపడానికి సాధనంగా మనం జాతీయ ప్రజాస్వామిక సంఘటనను నిర్మించాలి. దేశంలోని దేశభక్త శక్తులన్నిటిని, కార్మికవర్గాన్ని ధనిక రైతులు, వ్యవసాయ కూలీలతో సహా యావత్తు రైతాంగాన్ని, మేధావి వర్గాన్ని గుత్తాధిపత్యేతర బూర్జువావర్గంలోని అత్యధిక భాగాన్ని ఈ సంఘటనలోకి తీసుకురావలసి వుంటుంది. ఇలాంటి సంఘటన ఇప్పుడులేదు. ఈ నాడు జాతీయ బూర్జువావర్గం మాత్రమే కాక, ప్రజాస్వామిక ప్రజానీకంలోని గణనీయమైన భాగంకూడాపాలక పక్షం యొక్క ప్రస్తుత విధానాల వెనుక సమీకృతం కాగా, ప్రజాస్వామిక ప్రజానీకంలోని మరొకభాగం ఈ కార్యక్రమానికి అనుకూలంగా, పాలక విధానాలువామపక్ష-వైపు మొగ్గేటట్టుచేయాలని పోరాడుతున్నది. ప్రజాస్వామిక ప్రజానీకంలోని ఈ చీలికను తొలగించే కృషిలో,అలాంటి జాతీయ సంఘటన ప్రాదుర్భావం పొంది క్రమంగా పెంపొందుతుంది. జాతీయవిధానాలను తారుమారుచేయజూస్తున్న అభివృద్ధి నిరోధక శక్తులను వేరుచేసి, ఓడించడానికి, పై కార్యక్రమాన్ని అమలుజరపడానికి అవసరమైన విధంగా ప్రభుత్వవిధానాలలో మార్పులు తేవడానికి, సమూలమైన సంస్కరణలు అమలు జరపడానికి దేశవ్యాప్తంగా సాగే జాతీయ ప్రజోద్యమాలలోను, పోరాటాలలోను ఈ సంఘటన రూపొందుతుంది.

82. కార్మికవర్గం తన వర్గ సంఘాలమధ్య ఐక్యతను సాధిస్తూ, ఈ జాతీయ ప్రజోద్యమాన్ని ప్రారంభించడానికి చొరవ తీసుకోవాలి. ఇప్పుడున్న జీవన ప్రమాణాలు పడిపోకుండా కాపాడుతూ వాటిని ఇంకా పెంపొందించడంకోసం, బ్యాంకులు పెట్రోల్ గుత్తాధిపత్య సంస్థలు, విదేశీ వాణిజ్యం మున్నగువాటిని జాతీయం చేయించడంకోసం, ప్రభుత్వరంగాన్ని ప్రజాతంత్ర మొనర్చేటట్టు చూడటంకోసం కార్మికవర్గం సాగించే పోరాటం ఈ జాతీయ ఉద్యమంలో కీలకమైనదిగా వుంటుంది.

సువిశాలమైన గ్రామీణ ప్రాంతాలలోని అశేష రైతు ప్రజా సామాన్యాన్ని, వ్యవసాయ కూలీలను ఈ జాతీయ ఉద్యమంలోకి సమీకరించిననాడు, ఈ ఉద్యమం మొత్తం దేశాన్నే ఊపివేయగల్గిన బలీయమైన శక్తిగా తయారవుతుంది. స్వయంగా సేద్యం చేసే అశేష రైతాంగం ఫ్యూడల్ అవశేషాలను నిర్మూలించడానికి ఉద్దిష్టమైన, సమగ్రమైన వ్యవసాయ సంస్కరణలను పూర్తిగా అమలుజరపాలని, రైతు ఆర్థిక జీవనంలో ఒడిదుడుకులు లేకుండా చేయాలని, వాణిజ్య, వడ్డీ పెట్టుబడుల దోపిడీ నుంచి రక్షణ కల్పించాలని, వసతి సౌకర్యాలను విస్తరింపచేయాలని, ఆధునిక సాంకేతిక పద్ధతులను అధికంగా వినియోగంలోకి తేవాలని కోరుతూ సాగించే పోరాటాలు. అలాగే భూమిలేని రైతులు, వ్యవసాయకూలీలు బంజరుభూములను, మిగులు తేలినభూములను పంచాలని, జీవించడానికి అవసరమైన కనిష్ఠవేతన నిర్ణయించి అమలుజరపాలని, షెడ్యూల్డ్ కులాలవారికి, భూమి బుట్టా లేని ఆదివాసులకు ప్రభుత్వ వ్యవసాయక్షేత్రాలను ఏర్పాటు చేయాలని సాగించే పోరాటాలు - అశేష గ్రామీణ జనసామాన్యానికి సంబంధించిన ఈ పోరాటాలన్నిటికీ జాతీయ ప్రాధాన్యం వుంది. వారు సాగిస్తున్న ఈ పోరాటాలు వారి జీవనస్థితి గతులను బాగుచర్చడానికి తోడ్పడటంమాత్రమే కాక, దేశ వ్యవసాయోత్పత్తి పెంచి, చీటికి మాటికి దాపురిస్తున్న ఆహార సంక్షోభాలను తొలగించి, విస్తరిల్లే మన పారిశ్రామికీకరణకు గట్టి పునాదిని చేకూర్చుకోవడానికి కూడా సహాయకరం కాగలవు.

రైతులు, వ్యవసాయ కార్మికులు తమ ప్రజా సంఘాలను నిర్మించుకోవటంలోనూ, జాతీయ ఆందోళనోద్యమంలో భాగంగా తమ పోరాటాలను పెంపొందించు కోవటంలోను, వారికి అన్నివిధాల సహాయంచేసే బాధ్యత నగరాలలో, పట్టణాలలోవున్న కార్మిక వర్గానిది. దీని ఫలితంగా కార్మిక - కర్షక ఐక్యసంఘటన రూపొందుతుంది. దీనికితోడు, మధ్యతరగతులను, మేధావి వర్గాన్ని కూడా సమీకరిస్తే, అది జాతీయ ప్రజాస్వామిక సంఘటనకు ప్రధానమైన ప్రోద్బలశక్తిగా రూపొందుతుంది.

భారత వైదేశిక నీతిఅయిన అలీన, శాంతి, సామ్రాజ్యవ్యతిరేక, వలస వ్యతిరేక విధానాన్ని పటిష్ఠవంతం చేయాలి. సరిసమానహోదా, పరస్పర లాభదాయక ప్రాతిపదికపై అన్ని దేశాలతోను, ముఖ్యంగా సోషలిస్టు దేశాలతో స్నేహసహకార సంబంధాలు స్థాపించుకోవాలి. భారతదేశ సర్వంసహాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడాలి. పాకిస్తాన్ వంటి ఇరుగుపొరుగు దేశాలతో మనకు గల వివాదాలను శాంతియుతంగా, సామ్రాజ్యవాదుల ప్రమేయం లేకుండా పరిష్కరించుకోవాలి అని కోరుతూ సువిశాల ప్రాతిపదికపై కొనసాగించే ఉద్యమం కూడా ఈ జాతీయ ఉద్యమంలో అంతర్భాగంగా వుంటుందని వేరే చెప్ప నవసరంలేదు.

83. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, వ్యవసాయ కార్మికుల ప్రజా సంఘాలు, అలాగే కమ్యూనిస్టు పార్టీ తదితర అతివాద, సోషలిస్టు పార్టీలుకలిసి సమిష్టిగా సాగించేకార్యాచరణనుండి జాతీయ ప్రజాస్వామిక సంఘటన ప్రాదుర్భావం పొందుతుంది. కాంగ్రెసును అనుసరిస్తున్న జన సామాన్యాన్ని మాత్రమే కాక, కాంగ్రెసులోని అభ్యుదయకర భాగాలను కూడా ఆ సంఘటన తనలో ఇముడ్చుకొంటుంది.

జాతీయ ప్రజాస్వామిక సంఘటన అంతకంతకు సువిశాల మవుతున్న కొలదీ, పెరిగే ప్రజోద్యమోద్వృత్తితో పాటు అది బలీయమైన సమరశీల శక్తిగా తయారవుతున్న కొలదీ, ఆ సంఘటన అభివృద్ధి నిరోధక శక్తులను వేరుచేసి ఓడించటంలోను, పాలక పక్షమైన కాంగ్రెసులోని మితవాద పక్షాన్ని అశక్తం చేయడంలోను ప్రభుత్వ విధానాలలో వామ పక్ష మొగ్గును తీసుకు రావడంలోను కృతకృత్యం కాగలుగుతుంది. అప్పుడు దేశంలోని శక్తుల బలాబలాల స్థితి ప్రజాస్వామిక సంఘటనకు అనుకూలంగా మొగ్గుతుంది. ఉద్యమదశయందు జాతీయ ప్రజాస్వామిక సంఘటన తన సొంత ప్రభుత్వాన్ని, సొంత రాజ్యాంగయంత్రాన్ని, జాతీయ ప్రజాస్వామ్య రాజ్యాంగ యంత్రాన్ని ఏర్పరచుకోగలుగుతుంది.

అలా ఏర్పడే రాజ్యాంగ యంత్రం సమరశీల జాతీయ ప్రజాస్వామిక ఐక్యసంఘటనలోని దేశభక్త, ప్రజాస్వామిక శక్తులన్నింటికి, ఆ సంఘటన కార్యక్రమాన్ని అమలు జరుపగలమని ప్రతిజ్ఞచేసిన శక్తులన్నింటికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

84. ఈ జాతీయప్రజాస్వామిక రాజ్యాంగ యంత్రం ఇప్పుడు అమలులోవున్న బూర్జువా ప్రజాస్వామిక రాజ్యాంగ యంత్రానికి, మితవాద బూర్జువావర్గంతోపాటు మొత్తం బూర్జువా వర్గంయొక్క ప్రయోజనాలను కాపాడుతూ అభివృద్ధి నిరోధకుల విషయంలో ఊగిసలాటలతోకూడిన రాజీవిధానాలను అనుసరిస్తున్న బూర్జువా ప్రజాస్వామిక రాజ్యాంగయంత్రానికి, గుణాత్మకంగా భిన్నమైనదిగా వుంటుంది. జాతీయ ప్రజాస్వామిక రాజ్యాంగ యంత్రం ఈ శక్తులపై పోరాటానికి సాధనంగా వుంటుంది. గుత్తాధిపత్యపు గ్రూపుల శక్తిని విచ్ఛిన్నం చేస్తుంది. ఫ్యూడల్శక్తులను కూకటి వేళ్ళతో పెకలించి వేస్తుంది.

జాతీయ ప్రజాస్వామ్యం, 1951 నాటి మన కార్యక్రమంలో కేంద్ర నినాదమైన జనతంత్ర ప్రజాస్వామిక రాజ్యాంగ యంత్రానికికూడా భిన్నమైనదే. 1951 డాక్యుమెంటులో జనతంత్ర ప్రజాస్వామ్యానికి సూచించబడిన వర్గ సమ్మేళనం, అలాగే కార్యక్రమం కూడా ఇప్పుడు జాతీయ ప్రజాస్వామ్యానికి ప్రతిపాదిస్తున్నటువంటివే అయితే ఈ రెంటికి తేడా ఎక్కడవున్నట్లు? జనతంత్ర ప్రజాస్వామ్యంలో దేశభక్తవర్గాల ఐక్యసంఘటనకు ఒక్క కార్మికవర్గమే నాయకత్వం వహిస్తుంది. జాతీయ ప్రజాస్వామ్యం విషయంలో, దేశభక్తవర్గాల ఐక్యసంఘటన నాయకత్వంలో జాతీయ బూర్జువావర్గం, కార్మికవర్గం పాలు పంచుకొంటాయి.

గడచిన పదిసంవత్సరాల కాలంలో మనం సాగించిన ప్రజాస్వామిక, ప్రజాపోరాటాల అనుభవం దృష్ట్యాను, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం తన 1960 స్టేట్మెంటులో నిర్వచించిన కొత్తయుగంలో కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలకు చేకూరుతున్న అవకాశాల దృష్ట్యాను మనపార్టీ ప్రస్తుత ప్రభుత్వ వర్గస్వభావం గురించి, స్వతంత్ర జాతీయార్థిక వ్యవస్థ నిర్మాణంలోను, అలీనమైన, శాంతిదాయకమైన స్వతంత్ర వైదేశిక నీతిని నిర్వహించడంలోను కొంతవరకు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టటంలోను నిర్వర్తిస్తున్న పాత్రను గురించి పునరాలోచించి, తిరిగి అంచనావేసుకొన్నది.

జాతీయ బూర్జువావర్గంయొక్క ద్వంద్వాత్మక స్వభావాన్ని గుర్తించిన మనం, ఆ వర్గం అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ విధానాల ఆచరణలో ఏ విధమైన సంఘర్షణలకు, వైరుధ్యాలకుదారితీస్తున్నాయో చూస్తున్నాము, ఆర్థికాభివృద్ధివేగం తగ్గిపోయింది. దేశ ఆర్థిక జీవనంలో ప్రతిష్టంభనలు, చివరకు సంక్షోభాలు కూడా తప్పటంలేదు. రాజకీయ రంగంలో అభివృద్ధి నిరోధకశక్తులు ప్రమాదకరంగా ప్రబలుతున్నవి. ఫ్యూడల్ శక్తులతోనూ, విదేశీ గుత్తాధిపత్యంతోను పొత్తుకలిసిన గుత్తాధిపత్యపు గ్రూపుల శక్తి పెరిగిపోతున్నది. ఆ గ్రూపులు జాతీయ విధానాలను తారుమారు చేయాలని, కాలచక్రాన్ని వెనక్కుమళ్ళించాలని చూస్తున్నాయి.

ప్రవర్ధమానమవుతున్న ప్రజాస్వామిక శక్తులకు, వర్ధమాన కార్మికోద్యమానికి, వృద్ధిచెందుతున్న రైతు ఉద్యమానికి, ఇంతెందుకు ఒక్కమాటలో చెప్పాలంటే, దేశంలోని మొత్తం దేశభక్త జనసామాన్యమంతటికి ఇవొక సవాలుగా తయారవుతున్నది. అభివృద్ధి నిరోధకశక్తులు, ఫ్యూడల్ సామ్రాజ్యవాద అనుకూలశక్తులు, గుత్తాధిపత్యపు గ్రూపులు కలసి తమ జాతీయవ్యతిరేక లక్ష్యాలు ఈడేర్చుకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆ ఉద్యమాలు అనుమతిస్తాయా ? లేక అవి దేశభక్త ప్రజాస్వామికశక్తు లన్నింటిని సమీకరించి, బలీయమైన జాతీయ ప్రజాస్వామిక సంఘటనను సృష్టించి, అభివృద్ధినిరోధకశక్తులను ఓడించి, ప్రభుత్వవిధానాలలో వామపక్షమొగ్గును తీసుకొచ్చి, ప్రస్తుత పెట్టుబడిదారీ విధానపు దివాలాకోరు పంథానుంచి దేశాన్ని మళ్లించి, అందుకు ప్రత్యామ్నాయమైన మార్గంలోకి దేశాన్ని తీసుకెళ్లి, సామ్రాజ్య వ్యతిరేక, ఫ్యూడల్ ప్రతికూల విప్లవ కర్తవ్యాలను పూర్తిచేసి, గుత్తాధిపత్యపు గ్రూపుల శక్తిని విచ్ఛిన్నం చేస్తాయా?

పైన వర్ణించిన విధంగా జాతీయ ప్రజోద్యమాన్ని నిర్మించడానికి, జాతీయ ప్రజాస్వామిక ఐక్య సంఘటనను - జాతీయ బూర్జువావర్గంలోని దేశభక్త వర్గాలన్నీ కలిసి వుండే ఐక్యసంఘటనను స్థాపించడానికి పరిస్థితులు అత్యంత అనుకూలంగా వున్నాయి. ప్రస్తుతం అమలులోవున్న ప్రజాస్వామిక హక్కులను, పౌరస్వాతంత్ర్యాలను పూర్తిగా వినియోగించుకోవటం ద్వారాను, దేశభక్త జాతీయ బూర్జువావర్గంతో పోరాటం - ఐక్యత అనే ద్విముఖ విధానాన్ని సమయోచితంగా అమలు జరపడం ద్వారా దానిని సాధించవచ్చు.

జాతీయ ప్రజాస్వామిక ఐక్యసంఘటన స్థాపన నినాదం - ఇదే ఉత్తరోత్తరా జాతీయ ఐక్యసంఘటన ప్రభుత్వ స్థాపన నినాదంగా, జాతీయ ప్రజాస్వామ్య రాజ్యాంగ యంత్ర స్థాపన నినాదంగా మారుతుంది - ఈనాడు మహాసమీకరణ శక్తిగావుంది. కనుకనే దీనిని ఈ దశలో కేంద్ర నినాదంగా మనం తీసుకొంటున్నాము.

85. జాతీయ ప్రజోద్యమం ఉవ్వెత్తున విజృంభించినప్పుడు ఏర్పడే జాతీయ ప్రజాస్వామ్య రాజ్యాంగ యంత్రం జాతీయ ప్రజాస్వామిక ఐక్య సంఘటన చేతిలో సాధనంగా వుంటుంది. జాతీయ బూర్జువా శక్తులతోసహా కూడివుండే అలాంటి ప్రభుత్వంపైన క్రిందనుంచి, జాతీయ ప్రజోద్యమం నిరంతరం తీసుకొస్తుండే వత్తిడికి లోబడుతూ, అది ఐక్యంగా పనిచేస్తూ పెట్టుబడిదారేతర పంథాలో జాతీయాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు జరుపుకుంటుంది. అంటే విదేశీగుత్తాధిపత్యాన్ని నిర్మూలించడం, భారతీయ గుత్తాధిపత్యపు గ్రూపులను అరికట్టడం, సమూలమైన వ్యవసాయ సంస్కరణలను అమలు జరపడం దేశ ఆర్థిక రాజకీయ జీవితంలో కార్మికవర్గం క్రియాత్మకంగా పాల్గొనడానికి వీలైన విధంగా ప్రజాస్వామ్యాన్ని విస్తరింప చేయడం వంటి చర్యలను ఆ ప్రభుత్వం అమలు జరుపుతుంటుంది. ఈ పరిణామక్రమంలో, శక్తుల బలాబలాల స్థితి నిరంతరం కార్మికవర్గానికి, కార్మిక కర్షక ఐక్యసంఘటనకు అనుకూలంగా మారుతూవుంటుంది. తత్పర్యవసానంగా, రాజ్యాంగ యంత్ర నిర్వహణలో కార్మికవర్గ నాయకత్వ పాత్ర ఇనుమడిస్తూ వుంటుంది. సోషలిజాన్ని నిర్మించే తరువాత దశకు పరిస్థితులు ఈవిధంగా పరిపక్వమవుతాయి.

(సశేషం)

సంయుక్త సోషలిస్టు పార్టీవిధాననిర్ణాయక కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, జూలై 22

జూలై 29, 30 లలో ఇక్కడ సమావేశం కానున్న సంయుక్త సోషలిస్టు పార్టీ విధాననిర్ణాయక కమిటీ మిగతాప్రతిపక్షాలతో ఎన్నికల ఒప్పందాలు, ఐక్యసంఘటన నిర్మాణసమస్యలపై చర్చిస్తాయని తెలుస్తుంది.

ఈ కమిటీకి కన్వీనరుగా మధులిమాయి వ్యవహరిస్తున్నారు. అధ్యక్షుడు. యస్. యమ్ జోషి, ప్రధాన కార్యదర్శి శ్రీరాజనారాయణ్లు సభ్యులు కానప్పటికి కన్వీనరు ఆహ్వానాన్ని పురస్కరించుకొని సమావేశానికి హాజరవుతారని తెలుస్తుంది.

ఈ విధాన నిర్ణయక కమిటీలో ప్రొ. ముకుట్ బీహారీలాల్, రబిరాయ్, నాథ్పాయ్, కిశోర్కుమార్, మధులిమాయిలు ఉన్నారు.

ఈకమిటీ అభిప్రాయాలను యస్.యస్.పి. జాతీయ సభకు అందజేస్తాయి. జాతీయ సభ సమావేశ స్థలం, తేదీలు త్వరలో ప్రకటిస్తారు.

పార్టీ విధాన నిర్ణయం జరుగుతుంది గనుక, పార్టీ భవిష్యత్తు విధాన నిర్ణయంపై ఆధారపడి వుంది కనుక జరుగనున్న సమావేశానికి ఎక్కువ ప్రాధాన్యతను రాజకీయ పరిశీలకులు ఇస్తున్నారు.

కాంగ్రెసుకు వ్యతిరేకంగా ఉన్న అన్ని ప్రతిపక్షాలతో ఐక్య సంఘటన ఏర్పాటు చేయాలనే పక్షానికి డాక్టర్ రామమనోహర లోహియా నాయకత్వం వహిస్తున్నారు. ఏ ఐక్య సంఘటనకైనా సిద్ధాంత ప్రాతిపదిక ఉండాలన్న జోషి అభిప్రాయాన్ని కొందరు బలపరుస్తున్నారు.

క్యూబా విద్రోహుల నావపై దెబ్బ

మియామీ, జూలై 22

తేలికరకం ఆయుధాలను క్యూబాకు చేరవేయడానికి ప్రయత్నించిన తమ నావ నౌకదానిని క్యూబా ప్రభుత్వ సైనికులు ఉత్తర తీరం ప్రాంతంలో అడ్డగించి దెబ్బ తీశాయని, ఫలితంగా ఆనావ అమెరికా సముద్రప్రాంతంలోకి పారిపోయిందనీ, మియామి (అమెరికా) లోని క్యూబా విద్రోహులు గతరాత్రి తెలిపారు.

క్యూబా అధ్యక్షునికి రెండు ప్రభుత్వశాఖలపై బాధ్యత

హవానా, జూలై 22

క్యూబా ఆర్థిక, కేంద్ర ప్రణాళికామంత్రిత్వ శాఖలను అధ్యక్షుడు ఆస్వాల్డో డార్టికాస్ తన ప్రత్యక్ష అధికారం క్రిందకి తీసుకున్నారని నేడిక్కడ అధికార ప్రకటన వెలువడింది. ఇంతవరకు ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న డాక్టరు రెగినో బోటి వేరే బాధ్యతలను స్వీకరిస్తారని ఈ ప్రకటనలో తెలిపారు.

సింద్రీ ఎరువుల ఫ్యాక్టరీ లాకౌట్:

8 వేలమంది నిరుద్యోగం; రోజుకు రు. 20 లక్షల ఉత్పత్తి నష్టం

ధన్‌బాద్, జూలై 2

ప్రభుత్వ రంగంలోని సింద్రీ ఎరువుల ఫ్యాక్టరీ మేనేజిమెంటు యీ రోజు ఉదయం 6 గంటల నుండి కంపెనీని నిరవధికంగా మూసివేసినట్లు ప్రకటించింది.

ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న 8000 మంది కార్మికులు పారిశ్రామిక ట్రిబ్యునల్ యిచ్చిన అవార్డు అమలు సందర్భంలో మేనేజిమెంటు చేస్తున్న అపసవ్యపు వ్యాఖ్యానాలను ప్రతిఘటిస్తూ యీ నెల 17 వ తేదీ నుండి సమ్మె చేస్తున్నారు.

ఈ సమ్మె సందర్భంగా 144 వ సెక్షను అమలుజరుగుతూ వుంది. ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాలను పెద్దపెట్టున పోలీసులు కావలా కాస్తున్నారు.

ఇంత బందోబస్తు ఉన్నా సమ్మెదారులు విధ్వంసక చర్యలకు పూనుకోవచ్చునీ, అందువల్ల ఫ్యాక్టరీ ఆస్తులకునష్టంవాటిల్లకుండా ముందు జాగ్రత్తకోసమే యీ లాకౌట్ జరుపుతున్నామనీ మేనేజిమెంటు వాదిస్తున్నది. బీహార్ లేబర్ కమీషనర్ సమక్షంలో సమ్మెదారులకు, కంపెనీ నిర్వాహకులకు మధ్య జరిగిన సమాధాన సంభాషణలు విఫలమైనవి.

కంపెనీ ఆస్తులకు నష్టం కల్పించ ప్రయత్నించారని ఆరోపించుతూ నిర్వాహకులు 8 గురు కార్మికులపై కేసులు బనాయించారు.

నలుగురు కార్మికులనూ, ముగ్గురు యూనియన్ నాయకులనూ పోలీసు లింతవరకు అరెస్టు చేశారు.

గూడ్సు ప్రమాదం

ఇది ఇలా వుండగా మొన్న సోమవారం నాడు ఫ్యాక్టరీ పై రింగులో కాల్చివేసిన బొగ్గు తునకని మోసుకువెళ్లే ఒక గూడ్సుబండి పట్టాలు తప్పిపోయింది.

ఇది సమ్మెదారులు జరిపిన విధ్వంసక చర్య అని ఆరోపిస్తూ ఫ్యాక్టరీ మేనేజిమెంటు సమ్మెదారులను మరో కేసులో ఇరికించజూస్తున్నది.

న్యూయార్క్‌లో ఘర్షణలు

న్యూయార్కు, జూలై 22

న్యూయార్కులో నీగ్రోలు నివసించే హార్లెం ప్రాంతంలో జనసమూహాన్ని చెదరగొట్టడానికి పోలీసులు పలుసార్లు గాలిలో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు నీగ్రోలు తీవ్రంగా గాయపడ్డారు.

ఒకచోట ఇండ్లు బద్దలుగొట్టినారన్న మిషతో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేయడంతోనే అక్కడ ఒక పెద్ద జనసమూహం చేరింది.

వారిని చెదరగొట్టడానికిగాను పోలీసులు పలుసార్లు గాలిలో కాల్పులు జరిపారు. తరువాత జనం చెదిరిపోయారు.

ఇక్కడప్రారంభమైన జాతివిద్వేషఘర్షణల్లో సోడాబుడ్లు ప్రయోగించినట్లు తెలుస్తున్నది.

నేటిరాత్రి దాదాపు రెండు డజన్లమందిని పోలీసులు అరెస్టుచేశారు.

రాత్రిపూట బ్రూక్లిన్‌లోని బెడ్ ఫోర్డు స్టైవెసెంట్ ప్రాంతంలో కొన్ని దుకాణాల కిటికీలను బ్రద్దలుగొట్టారు.

న్యూయార్క్‌లోని హార్లెం (నీగ్రోలపేట)లో పోలీసులు దారుణహింసాకాండ సాగిస్తూ, ఒక నీగ్రో యువకుని కాల్చిచంపిన ఫలితంగా ఇక్కడ గత నాలుగు రోజులుగా ఘర్షణలు చెలరేగిన విషయం పాఠకులకు విదితమే.

ఉ. ప్ర. కాంగ్రెస్ ఎన్నికల తగాదా

త్వరలో కామరాజ్ నిర్ణయం

న్యూఢిల్లీ, జూలై 21

ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికలవిషయమై శ్రీ నందా సమర్పించిన నివేదికపై తన నిర్ణయాన్ని జులై 24 వ తేదీలోపల ప్రకటిస్తానని కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్ నేడు యిక్కడ చెప్పారు.

ఉత్తరప్రదేశ్ మంత్రివర్గ సభ్యులతోనూ చీలిపోయిన వారి నాయకులతోనూ విడివిడిగా సంప్రదించిన తరువాత శ్రీ కామరాజ్ యీ ప్రకటన చేశారు.

శ్రీ నందా నివేదికలోని వివరాలను బైట పెట్టటానికి ఆయన నిరాకరించారు. వాటిని తాను ఇంకా పరిశీలిస్తున్నాననిమాత్రంచెప్పారు.

ఈరోజు ఉదయం శ్రీ కామరాజ్ ప్రధాని శ్రీ శాస్త్రిని కలుసుకుని చర్చలు జరిపారు.

ఇస్తాంబుల్ శిఖరాగ్ర సభ

సంయుక్త ప్రకటన

ఇస్తాంబుల్, జూలై 22

టర్కీ, ఇరాన్, పాకిస్తాన్, దేశాలమధ్య ఆర్థిక, సాంస్కృతిక, సహకార సంబంధాలను బలవత్తరం చేసుకొనే పథకాలపై ఒప్పందం కుదిరిందని నేడిక్కడ వెలువడిన సంయుక్త ప్రకటనలో పై మూడుదేశాలు తెలియజేశాయి.

ఇక్కడ రెండు రోజులుగా జరిగిన ఇరాన్, టర్కీ, పాకిస్తాన్ దేశాల శిఖరాగ్ర సంభాషణల అనంతరం ఈ సంయుక్త ప్రకటన వెలువడింది.

ఈ దేశాల మధ్య సహకార సంబంధాలు పెంపొందడం ఇతర జాతీయ సంస్థలలో తమ కార్యకలాపాలకు విఘాతం కల్గించదని ఈ మూడురాజ్యాల అధినేతలూ అభిప్రాయపడ్డారు. ఇతర దేశాలు పాల్గొనే విషయాన్ని ఆలోచించడానికి వారు సుముఖులుగా ఉన్నారని కూడా ఈ ప్రకటన తెలియజేసింది.

పరస్పర ప్రయోజనాత్మకమైన విషయాల గురించి నిర్ణయించేందుకు ఈ మూడు దేశాల విదేశాంగ మంత్రులతోను, ఇతర మంత్రులతోను ఒక మంత్రి మండలిని ఏర్పరచడానికి వీరు ఆమోదించారని కూడా ఈ ప్రకటన పేర్కొన్నది.

కొత్తగూడెంఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి

1967 కల్లా ప్రారంభం కాగలదని శాసనమండలిలో మంత్రి ప్రకటన

హైదరాబాద్, జూలై 21

కొత్తగూడెంలోని ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి 1967 లో ప్రారంభం కాగలదని నేడు ఆంధ్ర శాసనమండలిలో న్యాయశాఖామంత్రి శ్రీ పి. వి. నరసింహారావు తెలియజేశారు.

ముఖ్యమంత్రికి బదులుగా మంత్రి నరసింహారావు సమాధానమిస్తూ, ఆ ఫ్యాక్టరీ ప్రయివేటు రంగానికి మార్చబడిందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ననుసరించే ఇలా జరిగిందని ఆయన చెప్పారు.

మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ జిల్లాపరిషత్తులు పంచాయతీ సమితులతో సహా స్థానిక సంస్థల క్రింద పని చేస్తున్న ఉపాధ్యాయులు ప్రావిడెంటుఫండుకు డబ్బుకట్టుకోవడానికి అనుమతి యివ్వబడిందన్నారు.

సీట్ల రిజర్వేషన్

ఒక ప్రశ్నకు మంత్రి శ్రీ నరసింహారావు జవాబిస్తూ, తిరుపతిలోని శ్రీవేంకటేశ్వరయూనివర్శిటీ ఇంజనీరింగుకాలేజీ, వాల్తేరులోని ఆంధ్ర యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీలో మినహా తక్కిన్నా అన్ని ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ, ఏడవ ఫారం, [illegible] స్కూళ్ళలోనూ ఉత్తీర్ణులైన విద్యార్థులకు 20 శాతం సీట్లు రిజర్వు చేయబడినాయని చెప్పారు.

ఇలాంటి విద్యార్థులకు పాలిటెక్నిక్ సంస్థలలో రిజర్వేషన్ వుండదు.

దేశాయ్ అవార్డు పొడిగింపుకు నిరసన

బొంబాయిలో 8 వేల బ్యాంకు ఉద్యోగుల ప్రదర్శన

బొంబాయి, జూలై 22

దేశాయ్ (బ్యాంకింగ్ పరిశ్రమ) అవార్డు వ్యవధిని పొడిగించ రాదని డిమాండు చేస్తూ బొంబాయినగరంలోని వివిధ బ్యాంకులకు సంబంధించిన 8000 మంది ఉద్యోగులు నేడు ప్రాంతీయ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ఒక ప్రదర్శన జరిపారు.

మధ్యాహ్నం భోజన విరామసమయంలో వీరంతా బొంబాయిలోని దూరదూర ప్రాంతాలలో ఉన్న తమ కార్యాలయాలనుండి కమిషనర్ కార్యాలయంవద్దకు ఊరేగింపుగా వచ్చారు.

తమ పని పరిస్థితులను మెరుగుపరిచేటందుకూ, వేతనాల పునర్వ్యవస్థీకరణ జరిపేటందుకూ త్రైపాక్షిక సభ యేర్పాటు చేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు.

ఈ ప్రదర్శన మహారాష్ట్ర స్టేట్‌బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య పిలుపు ననుసరించి జరిగింది.

దేశాయ్ అవార్డులో అనేక అవకతవకలున్నవనీ, వాటిని సర్దుబాటు చేయవలసిన అవసరం వుందనివారంతా ఒకపక్క ఘోషిస్తూవుండగా ఈమాసాంతంతో ముగిసిపోతున్న ఈఅవార్డుకు తిరిగి జీవం పోయడానికి ప్రభుత్వం పూనుకోవడం దారుణమైన చర్య అని రాష్ట్రబ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ వి. యం. విట్నిస్ ఒక పత్రికా ప్రకటన చేశారు. యజమానుల మెప్పు పొందేటందుకు ప్రభుత్వం ఈ చర్య తలపెట్టిందని ఆయన ఈ ప్రకటనలో విమర్శించారు.

కాంగో నుండి టాంగనీకాకు కాందిశీకుల రాక

దార్ ఎస్సలాం, జూలై 22

కాంగో (లియోపోల్డ్‌విల్లీ) నుండి గత మాసంలో దాదాపు 5 వందలకు పైగా కాందిశీకులు పశ్చిమ టాంగనీకాకు వలస వచ్చినట్లు 'టాంగనీకా స్టాండర్డు' అనే పత్రిక నేడు ప్రకటించింది.

వీరందరూ తమ ఆస్తిపాస్తులను కాంగోలోనే వదలివేసి 35 మైళ్ళ వెడల్పు కలిగిన టాంగనీకా సరస్సును దాటి పశ్చిమ టాంగనీకాకు చేరినట్లు ఆ వార్తాపత్రిక ప్రకటించింది.

ఇలా వచ్చిన కాందిశీకులలో మూడువందల మంది ప్రభుత్వ అత్యవసర శిబిరాల్లోనూ, మిగతావారు తమ స్నేహితుల, బంధువుల యిండ్లలోనూ ఆశ్రయం పొందుతున్నారని ప్రాంతీయ పోలీసు కమాండర్ అపీను తెలియజేసినట్లు ఆ పత్రిక రాసింది.

5 వందలమందికి పైగా కాంగో నుండి వలస వచ్చినట్లు తాను భావించడం లేదని, తనకు తెలిసినంతవరకూ వీరు టాంగనీకా సరస్సుకు అవతలవైపున కాంగోలో వుంటున్న టాంగనీకా దేశస్థులేనని టాంగనీకా హోం మంత్రిత్వశాఖ అధికారి ఒకరు చెప్పారు.

సింగపూర్‌లో అల్లర్లు

4 గురి మరణం; 178 మందికి గాయాలు

సింగపూర్, జూలై 22

సింగపూర్ పరిసర ప్రాంతమైన గేలాండులో నేడు జరిగిన సంఘర్షణల ఫలితంగా గాయపడిన అనేక మంది చైనావారిని, ఆరుగురు మలయా వారిని ఆస్పత్రికి చేర్చారు. ఈ ఘర్షణల్లో నలుగురు మరణించారు. 178 మంది గాయపడ్డారు.

సింగపూర్‌లో కర్ఫ్యూ తొలగించిన నేటి అయిదున్నర గంటలలోపలే ఈ రోజు స్థానిక కాలమానం ప్రకారం 11.30 గంటలకు తిరిగి కర్ఫ్యూ విధించారు.

ఈ కర్ఫ్యూ కనీసం రేపటి ఉదయం వరకైనా ఉంటుందని పోలీసులు చెప్పారు.

కర్ఫ్యూ ప్రారంభించబడక ముందే వేలాది జనం ఇండ్లకు వెళ్ళడానికి ప్రయత్నించడంతో సింగపూరు పట్టణంలో అలజడి ప్రారంభమైంది.

కాలి నడుచుకుంటూ వెళుతున్న ఒక మలయా వ్యక్తిని కొంతమంది చైనీయులు కారు లోనుండి బయటకులాగి, స్పృహ తప్పేవరకూ కొట్టి, రోడ్డుమీద పడేసి వెళ్ళిపోయారు. ఇక్కడ బయటి పోలీసులు తుపాకులు ధరించి కావలా కాస్తున్నారు.

సాయుధసైనిక శకటాలుకూడా రంగంలోకి వచ్చాయి. సింగపూర్‌లోని ముఖ్యవీధులన్నింటిలోను సైనికులు గస్తీ తిరుగుతున్నారు. రోడ్ల కూడలిలో ముళ్ల కంచెలు వేసి కావలా కాస్తున్నారు.

మలేషియా ప్రధాని టుంకూ అబ్దుల్ రహమాన్, మరో ముగ్గురు మంత్రులు హుటాహుటిని నేడిక్కడికి చేరి సింగపూర్ ప్రధాన మంత్రితోనూ, ఇతరపెద్దరాధికార్లతోనూ సమాలోచనలు సాగించారు.

అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఒక సభలో పోలెండ్ కమ్యూనిస్టు నాయకుడు విమర్శించిన సందర్భంలో నిరసనగా అమెరికా రాయబారి కాబట్ ఆ సభనుండి వాకౌట్ చేశారు.

ఆహార నిల్వలపై మహారాష్ట్రప్రభుత్వం కొత్తఉత్తర్వు

బొంబాయి, జూలై 22

ఆహార ధాన్యాల నిల్వదారుల నుండి, వారి వద్ద నిల్వవున్న సరుకును బైటకు తెప్పించే టందుకు నేడు మహారాష్ట్రప్రభుత్వం ఒకకొత్త ఉత్తర్వు జారీచేసింది.

ఈ రోజునుండి యీ సంవత్సరం డిసెంబరు 15 వ తేదీ వరకు అమల్లో వుండే యీ ఉత్తర్వు వరిధాన్యం, బియ్యం, గోధుమ, జొన్న, సజ్జ ధాన్యాలకు వర్తిస్తుంది.

మార్కెట్‌లో తిండిగింజల ధరలు విపరీతంగా పెరిగినదృష్ట్యా, పరిస్థితిని అదుపులోనికి తెచ్చేందుకే యీ ఉత్తర్వు ఉద్దేశించబడిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు ఉభయ శాసనసభల్లోనూ ప్రకటించారు.

పై సరుకుల నిల్వదారులంతా రాష్ట్రమంతటా తమవద్దవున్న సరుకు వివరాలను వ్రాతపూర్వకంగా, ఆహార ధాన్య కంట్రోలర్‌కుగానీ, ఆయా జిల్లాల స్థాయిలో రివెన్యూ అధికారులకుగానీ తెలియజేయాల్సి వుంటుంది. వ్యవసాయదారులైతే, వారు తమ వద్ద వుంచుకొనే సరుకు 25 క్వింటాల్స్ గానీ, ఆ పైగాగానీ వుంటేనే అధికారులకు తెలియజేయాలి.

10 క్వింటాల్సుగానీ, అపైన గానీ సరుకు గలనిల్వదారులంతా కూడా ప్రతినెలా 1 వ తేదీ లోపుగా ప్రభుత్వానికి విధమైన సమాచారం తెలియ జేయాల్సి వుంటుంది.

ఈ ఉత్తర్వును ధిక్కరించే వ్యక్తులు దేశ రక్షణ నిబంధనల క్రింద శిక్షార్హులవుతారు.

పశ్చిమబెంగాల్‌లో రేషనింగ్

కలకత్తా, జూలై 21

నిన్నటినుంచి పశ్చిమబెంగాల్‌లోని లోటు ప్రాంతాల పల్లెలూ, నగరాలలోవున్న కోటి మంది ప్రజలకు రేషనింగ్ అమలు జరుపబడు తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి. సి. సేన్ ఒకప్రకటనలో తెలిపారు. ఇది 5 వేల మందికి పైగా జనాభావున్నగ్రామాల,పట్టణాల ప్రజలకు వుపయోగపడుతుందనీ, ఆ ప్రదేశాలలో వారానికి తలకు ఒక కిలోగ్రాము బియ్యమూ, కిలోగ్రాము గోధుమలూ ఇవ్వబడతాయని ఆయన అన్నాడు.

భారతదేశానికి అమెరికా అప్పు

బొంబాయి, జూలై 21

అమెరికా ప్రభుత్వం భారతదేశానికి రెండు కోట్ల రూపాయల అప్పు యిచ్చే ఒడంబడికపై నేడు వాషింగ్‌టన్‌లో సంతకాలు జరిగినట్లు నేడిక్కడ విడుదల చేసిన అమెరికా వార్తా సర్వీసు సమాచారాన్నిబట్టి తెలుస్తోంది.

ఈ అప్పు మూలకంగా భారత దేశంలో బాల్‌బేరింగుల, రోలరు బేరింగుల ఉత్పత్తి శక్తిని పెంచడానికి ఉపయోగ పడుతుంది.

గూండాయిజాన్ని నిర్మూలించండి

పోలీసు ఉద్యోగులకు హోంమంత్రి శ్రీ నందా విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 22

దేశంలోని గూండాయిజాన్ని నిర్మూలించి ప్రజల అభిమానాన్ని పొందడానికి ప్రయత్నించవలసిందిగా భారత హోంమంత్రి శ్రీనందా దేశంలోని పోలీసు ఇన్‌స్పెక్టరు జనరల్స్‌ను నేడిక్కడ కోరినట్లు తెలుస్తూవుంది.

కేంద్ర రహస్య పోలీసు శాఖ డైరెక్టరు బి. యన్. మలిక్ అధ్యక్షతక్రింద దేశంలోని పోలీసు ఇన్‌స్పెక్టర్ల మహాసభ నేడిక్కడ ప్రారంభమైంది. ఈ మహాసభ మూడురోజుల పాటు జరుగుతుంది.

ఈ మహాసభలో శ్రీ నందా ప్రారంభోపన్యాసం గావిస్తూ, అవినీతి, పోలీసు సంక్షేమం, శాంతిభద్రతల పరిస్థితి, ధరల పెరుగుదల మున్నగు సమస్యలను గురించి ప్రస్తావించారు. ప్రజలకూ, పోలీసులకూమధ్యనుండే సంబంధాలు మెరుగుపడవలసిన ఆవశ్యకతను గురించి కూడా శ్రీ నందా ప్రస్తావించారు. ప్రజాభిమానాన్ని చూరగొనడానికి ప్రయత్నించవలసినదిగా ఆయన పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్స్‌కు హితవు చెప్పారు. ఇలా ప్రజాభిమానం చూరగొనే పక్షంలో తప్పనిసరిగా పోలీసులను ప్రజలు బలపరుస్తారని ఆయన అన్నారు.

ప్రజాస్వామిక వ్యవస్థలో పోలీసుల విధి నిర్వహణలో మార్పురావలసిన ఆవశ్యకతను గురించి ప్రసంగిస్తూ తాము ప్రజలకు మిత్రుల మనే భావాన్ని పోలీసులు ప్రజలలోకల్గించాలని అన్నారు.

దేశాన్ని నేడెదుర్కొంటున్న తీవ్రమైన సమస్య గూండాయిజం. దేశంలోని అరాచకాలన్నింటి వెనుక యీ గూండాలు సమీకృతమై ఉన్నారు. ఈ గూండాయిజాన్ని అంతమొందించడం అత్యవసరమని శ్రీ నందా చెప్పారు. గూండాలను సమర్థవంతంగా అణచడం ద్వారానే అరాచకత్వాన్ని తగ్గించగలమనేది ఈమధ్య జరిగిన మతఅల్లర్ల సందర్భంలో తనఅనుభవం రుజువు చేసిందని ఆయన అన్నారు.

అధిక ధరలు

దేశంలో అధిక ధరలనుగురించి శ్రీ నందా ప్రసంగిస్తూ దేశంలో నిజంగా ఆహారవస్తువుల కొరతలేదని దేశం మొత్తంమీద ఆహారధాన్యాల పరిస్థితి అంత చెడుగాలేదని అన్నారు. అయినప్పటికీ ధరలుమిన్నుముట్టుతున్నాయనీ, కొన్ని ప్రాంతాల్లో ఇవి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నాయని చెబుతూ, ఇన్‌స్పెక్టరు జనరల్సును తమ చర్చల సందర్భంలో ఈ విషయాన్ని పరిశీలించవలసినదిగా కోరారు.

అవినీతి

అవినీతిని గురించి శ్రీ నందా ప్రస్తావిస్తూ ఈ విషయంలో '[illegible]' అనేది యేమీ లేదని అమాయకులైన ఉద్యోగులు బాధపడకుండా అన్ని జాగ్రత్తలను తీసుకుంటామని ఆయన అన్నారు.

పోలీసుల సంక్షేమం విషయమై జాగ్రత్త వహించాలనీ, వారికి కావలసిన సదుపాయాలను కూర్చాలని శ్రీ నందా పోలీసు అధికారులకు చెప్పారు.

మూడురోజులపాటు జరిగే ఈమహాసభలో శాంతిభద్రతల సమస్యతోపాటు అనేక విషయాలను చర్చిస్తారు.

లావోస్ త్రైపాక్షిక శాంతిమహాసభ

స్థలనిర్దేశంపై ఉభయపక్షాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు

వియంతియానె జూలై, 22

లావోస్ త్రైపాక్షిక శాంతి మహాసభ జరపడానికి న్యూఢిల్లీనిసూచిస్తూ లావోస్‌ప్రధాన మంత్రి సొవన్నా ఫూమా చేసిన ప్రతిపాదనను పాథెట్‌లావో నాయకుడు సౌఫనోవాంగ్ తిరస్కరించినట్లు గతరాత్రి పాథెట్‌లావో రేడియో ప్రకటించిందని రాయిటర్ విలేకరి తెలియజేస్తున్నారు.

ఈ శాంతి మహాసభ జరిపేందుకు న్యూఢిల్లీ తగిన ప్రదేశం కాదని సౌఫనోవాంగ్ ఈ నెల 20 వ తేదీన సొవన్నాఫూమాకు రాసిన లేఖలో తెలియజేశారు. ఈ మహాసభ నాంపెన్‌లో గానీ, లేదా జకార్తాలో గానీ జరగాలన్న తన ప్రతిపాదనను కూడ సౌఫనోవాంగ్ ఈ లేఖలో గుర్తు చేశారు.

సౌఫనోవాంగ్ తన లేఖలో చేసిన ప్రతిపాదనను సొవన్నాఫూమా తిరస్కరిస్తూ ఈ మహాసభ న్యూఢిల్లీలోనే జరగాలని మరొకసారి ప్రతిపాదనచేస్తూ ఈనెల 22వ తేదీన సౌఫనోవాంగ్‌కు ఒక లేఖ వ్రాశారు. దీనికి సౌఫనోవాంగ్ ఒక టెలిగ్రాం ద్వారా సమాధానమిస్తూ ఈ మహాసభ స్థలం నిశ్చయం కంటె, సమావేశ ఆశయం అత్యంత ముఖ్యమైనదని సొవన్నాఫూమాకు తెలియజేశారు.

న్యూయార్క్ ఘటనలపై పోలీసు పరిశీలనకు జాన్‌సన్ ఆదేశం

న్యూయార్కు, జూలై 21

న్యూయార్క్‌లో నీగ్రోలు నివసించే ప్రాంతమయిన హర్లెంలో ఈ మధ్య జరిగిన సంఘర్షణలపై పరిశీలన జరపవలసిందిగా ఫెడరల్ పోలీసుశాఖను అధ్యక్షుడు జాన్‌సన్ ఆదేశించారు.

సంఘర్షణలను పరిశీలించవలసిందిగా మాత్రమే ఫెడరల్ పోలీసును తాను కోరినట్టు అధ్యక్షప్రకటనలో ఉంది. స్థానికఅధికారులకు అది సహాయకారిగా ఉండవచ్చునని ఆయన అన్నారు.

పంచాయతీ సమితుల, పరిషత్తుల బిల్లు

శాసనమండలిలో పాయింట్ ఆఫ్ ఆర్డరు త్రోసివేత

హైదరాబాద్, జూలై 21

శాసనసభ ఆమోదించిన పంచాయతీ సమితుల, పరిషత్తుల సవరణ బిల్లును ప్రవేశ పెట్టడానికి వ్యతిరేకంగా నేడు శాసన మండలిలో శ్రీ యస్. సోమయాజులు (యస్. డి.) లేవదీసిన పాయింట్ ఆఫ్ ఆర్డరు డిప్యూటీ చైర్మన్ త్రోసిపుచ్చారు.

ఆ తరువాత బిల్లుపై జరిగిన చర్చలో శ్రీ పి. రామచంద్రయ్య శ్రీ యస్. సోమయాజులు (యస్. డి.), శ్రీ గింగిరాజు (కాంగ్రెస్), శ్రీ కూర్మాచార్యులు (యస్. డి.), శ్రీ వి. వి. రాఘవాచారి (యస్. డి.), శ్రీ డి. గోవిందరాజులు, శ్రీ వి. శ్రీరామమూర్తి (ఉపాధ్యాయ) శ్రీ సీతారామిరెడ్డిగార్లు పాల్గొన్నారు.

చర్చకు మంత్రి సమాధానం చెప్పిన తరువాత బిల్లు మొదటిపఠనం ఆమోదించబడింది.

సభను జూలై 22 వ తేదీ ఉదయానికి వాయిదా వేశారు.

గుజరాత్ నుండి వేరుశనగ ఎగుమతి నిషేధం

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు

అహ్మదాబాద్, జూలై 22

గుజరాత్ రాష్ట్రంనుండి వేరుశనగకాయ, వేరుశనగ నూనె ఎగుమతులను వెంటనే నిషేధించడానికి కేంద్ర ఆహార వ్యవసాయశాఖల మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం సమ్మతించారు. మొత్తంపైన రాష్ట్రంలో ఆహార పరిస్థితిని, ముఖ్యంగా వేరుశనగనూనె, కాయ సరఫరా స్థితిని పరిశీలించేటందుకు ఆయన నిన్న నే యిక్కడకు వచ్చారు.

ఈ సరుకు రవాణాపై వెనువెంటనే నిషేధం అమలుజరపడానికి తాను సమ్మతించినానని ఆయన పత్రికాగోష్ఠిలో వెల్లడించారు.

ఆ పిమ్మట కొద్ది గంటలలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించిన ఉత్తర్వును ప్రకటించింది.

ప్రతి పంచాయతీలో కనీసం ఒక చౌకడిపో

ఐక్యాందోళనలో అన్ని పార్టీలను కలుపుకురావాలని నల్లగొండజిల్లా కమ్యూనిస్టు కార్యవర్గం విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 20

జిల్లాలో ఆహార సమస్య తీవ్రరూపం ధరిస్తూండడాన్ని గమనిస్తూ, నల్లగొండజిల్లా కమ్యూనిస్టుపార్టీ కార్యవర్గం ప్రతిగ్రామ పంచాయతీలో కనీసం ఒక చౌకడిపోనన్నా తెరిచేటట్లు ఐక్యాందోళనలో అన్నిపార్టీలవారినీ కలుపుకొని రావాలని పార్టీసభ్యులకు, శాఖలకు విజ్ఞప్తి చేసింది.

17, 18 జులై 1964 తేదీలందు హైద్రాబాదు, ప్రదేశ్ సమితి కార్యాలయములో నల్లగొండజిల్లా పార్టీ విస్తృత కార్యవర్గ కమిటీ సమావేశం జరిగినది. సమావేశానికి ప్రదేశ్ సమితి కార్యదర్శి యగు రాజశేఖరరెడ్డి శ్రీ హాజరైనారు, కేంద్ర జాతీయ సమితి, ప్రదేశ్ సమితి నిర్ణయాలపై రిపోర్టు ఇచ్చారు. సమావేశానికి కార్యవర్గసభ్యులు 13 గ్గురిలో 11 గురు హాజరైనారు, ప్రత్యేక ఆహ్వానాలపై 8 మంది హాజరైనారు. సమావేశయందు జిల్లాలోని 7 తాలూకాలందు ఈ నెల 30 వ తేదీనుండి 8 అగస్టువరకు 14 పార్టీ సర్వ సభ సమావేశాలు గావించి పోటీపార్టీవారుచేస్తున్న విచ్ఛిన్న చర్యలను వివరించి పార్టీ ఇచ్చిన పిలుపులను జయప్రదము గావించుటకు నిర్ణయాలు తీసికోబడినవి. జిల్లా నాయకులు ఆయా జనరల్‌బాడీ సమావేశాలకు వెళ్లుటకు నిర్ణయింపబడింది.

ఆహారసమస్యపై ఆందోళన గావించుటకు రాష్ట్రసమితి ఇచ్చిన పిలుపును దృష్టియందుంచుకొని జిల్లాలోని అన్ని తాలూకా, గ్రామ కమిటీలు, పార్టీ సభ్యులు మహజర్లపై సంతకాలు తీసికొని తాలూకా, జిల్లా అధికారులకు 10 అగస్టు తేదీన సమర్పించాలని తీర్మానించ బడింది.

సమావేశానికి వచ్చిన సభ్యులు అగస్టు 14 వ తేదీవరకు 160 విశాలాంధ్ర పత్రికలకు సంవత్సర చందాదార్లను చేర్పించటానికని కోటాలు తీసుకొన్నారు. జిల్లాలో జరగనున్న జనరల్ బాడీ సమావేశాలందు అదనంగా చందాదార్లను చేర్పించుటకు నిర్ణయించబడింది.

ఆహార సమస్యపై తీర్మానం

ఆహార సమస్యను పరిష్కరించుటకు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తగుచర్యలు తీసికోనందుకు జిల్లా కార్యవర్గకమిటీ తన విచారాన్ని తెలియచేసింది. ఆహార సమస్య చాల తీవ్రరూపం దాల్చుచున్నదని, ప్రభుత్వం తగు చర్యలను వెంటనే తీసికోవలెనని, ప్రతి గ్రామపంచాయతీకి చౌకడిపోను స్థాపించి, తిండిగింజలను, ప్రజల జీవితావసర వస్తువులను న్యాయమైన ధరకు ఇచ్చుటకు పూనుకోవలయునని కోరుచూ తీర్మానము గావించినది. ఆహారసమస్య పరిష్కారమునకు గావింప బడనున్న ఆందోళనలో అన్ని రాజకీయపార్టీలను కలుపుకొని ఐక్య ఆందోళనగావించాలని పార్టీశాఖలకు, పార్టీసభ్యులకు జిల్లా కమిటీ పిలుపు ఇచ్చింది.

ప్రధాని నెహ్రూ మరణానికి, ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మారిస్ థోరే, డాక్టర్ బాలిగా మరణాలకు జిల్లా కమిటీ తన గాఢ సంతాపాన్ని తెలియ జేసింది.

సూర్యాపేటలో జిల్లా పార్టీ సభ్యుల సమావేశము 16, 17, 18 అగస్టు తేదీలందు జరపుటకు నిర్ణయించబడింది. రాష్ట్రనాయకులు శ్రీయుతులు వై.వి. కృష్ణారావు, రావి నారాయణరెడ్డి, మఖ్దూంమొహియుద్దీన్ గారలు హాజరుకాగలరు.

సూర్యాపేటలో 18 అగస్టు తేదీ రాత్రి కమ్యూనిస్టుపార్టీ పక్షాన బహిరంగసభ జరపుటకు నిర్ణయించబడింది. ఈ బహిరంగసభలో పై నాయకులు, శ్రీమతి ఆరుట్ల కమలాదేవి మొదలగువారు ఉపన్యసించగలరు.

శ్రీమతి సిరిమావోకు శ్రీ శాస్త్రి ఆహ్వానం

న్యూఢిల్లీ, జూలై 22

సింహళంలో పౌరసత్వంలేని భారతీయుల సమస్యపై సంభాషణలు జరిపే నిమిత్తం సింహళ ప్రధాని శ్రీమతి సిరిమావోను న్యూఢిల్లీకి రావలసినదిగా భారత ప్రధాన మంత్రి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి ఆహ్వానించినట్లు తెలియవచ్చింది.

శ్రీమతి సిరిమావో భారతదేశానికి ఎప్పుడు వస్తారనే విషయం ఇదమిత్థంగా తెలియదు. తన పర్యటన తేదీ నిర్ణయాన్ని శ్రీమతి సిరిమావోకే వదలినట్లు తెలుస్తున్నది.

గృహిణుల కడగండ్లు

(1వ పేజీ తరువాయి)

ప్రతి ఒక్క గృహిణిని వేధించుతోంది.

బియ్యంధర 30 శాతం పెరిగింది. ఇంకా పంచదార, గోధుమలు మార్కెట్టులోనే కన పడకుండా పోయాయి. ఇటీవల రెండుమాసాల క్రితం వరకు కూరగాయలు సరసమైనధరలకు పుష్కలంగా లభ్యమవుతూ వుండేవి. కాని యిప్పుడు కూరగాయల ధరలు కూడా పెరిగి పోవడంతో మధ్య తరగతి ప్రజలు అవస్థపడ వలసి వస్తోంది. రెండు నెలల క్రిందట కిలో 60 పైసలు ధర వుండే [illegible] ఇప్పుడు కిలో ఒక రూపాయి యాభై పైసలు చొప్పున అమ్ముతున్నారు.

ఈ ప్రాంతంలో జూన్, జూలై మాసాలు అరటిపండ్లు సీజనుగా వుండేవి. కాని ఈ సంవత్సరం పేదవారికి సంబంధించిన అరటి పండ్లు కూడా సరసమైన ధరలకు లభించడం లేదు. అరటి పండ్లను విదేశాలకు ఎగుమతిచేసి ప్రభుత్వం విదేశమారకద్రవ్యాన్ని సంపాదించు కున్నందున ఈ ప్రాంతంలో డజను అరటి పండ్లు 75 పైసలు [illegible]. ఈ విధంగా అరటిపండ్ల ధర నూటికి నూరుపాళ్లు పెరిగింది.

మార్కెట్టులో [illegible] కూరగాయలు గాని, అరటిపండ్లు గాని కొరతగా లేవనీ, ఇతర వస్తువులధరలు పెరిగినదృష్ట్యా వర్తకులు వాటి ధరలను కూడా కృత్రిమంగా పెంచివేస్తున్నారనీ తెలుస్తోంది.

రొట్టె ఖరీదుకూడా పావు 35 పైసలనుండి 40 పైసలకు పెరిగింది. గోధుమపిండి ధర పెరిగినందున తాము రొట్టె ఖరీదును పెంచ వలసి వచ్చిందని దుకాణదార్లు సమర్థించి చెప్పుకొన్నారు.

ధరలు తగ్గించడానికని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలవలన ఫలితమేమీ కనబడడం లేదు.

బ్రహ్మపుత్రానదికి తిరిగి వరద

గౌహతి, జూలై 21

జోర్‌హాట్ డివిజన్‌లోని అప్పర్ మజులి ప్రాంతంలోని రెండు గ్రామాలు బ్రహ్మపుత్ర వరదల మూలకంగా పూర్తిగా దెబ్బ తిన్నాయి. కోలాకుటుం అనే గ్రామం పూర్తిగా కొట్టుకుపోయింది. దిగ్హాల్‌గొర అనే మరో గ్రామంలో కొంతభాగంకూడా కొట్టుకు పోయింది.

గత కొద్దిరోజులుగా భారీ వర్షాల మూలకంగా అస్సాంరాష్ట్రంలో తిరిగివరదలొచ్చాయి. జోర్‌హాట్ నుంచి అందుతున్న వార్తలనుబట్టి యీ వార్తలు తెలిశాయి.

ప్రాణనష్టమేమీ లేదనీ, సుమారు రెండు వందలకు పైగా కుటుంబాలు రక్షణకొరకు మజులి కట్టమీదకు చేరారనీ, అప్పర్ మజులికి చెందిన [illegible] గ్రామాలకు చెందిన మూడు వేలమంది ప్రజలు వరదల్లో చిక్కుకున్నట్లు ఆ వార్తలు తెలియజేస్తున్నాయి.

బ్రహ్మపుత్రానది వరద ప్రవాహం వలన కట్టలకు కొన్నిచోట్ల గండ్లు పడ్డాయి. జాగ్‌హార్ ప్రాంతంలో కట్టకు గండిపడడం మూలకంగా 173 కుటుంబాలు నిరాశ్రయు లయ్యారు.

ఆహార సంక్షోభం

(1 వ పేజీ తరువాయి)

రద్దుచేయాలనీ, ఆహారధాన్యాల ఎగుమతిని నిషేధించాలనికూడా ఆ ప్రకటనలో కోరారు.

రాష్ట్ర హోటల్ యజమానుల సమాఖ్య కార్యదర్శి నాయకత్వాన పదకొండుమంది ముఖ్యమంత్రి శ్రీ వి. పి. నాయక్ వద్దకు రాయబారం వెళ్ళి తమ సమస్యలను వివరించే విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించారు.

అత్యవసర వస్తువులను న్యాయమైన ధరలకు తమ సంఘాలద్వారా సరఫరా చేయటానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోనట్లయితే, ధరలు పెంచకుండా తమ వ్యాపారాన్ని కొనసాగించటం కష్టమని ఆ విజ్ఞప్తి పత్రంలో తెలియజేశారు.

పరిస్థితిని అధ్యయనం చేయటానికి, నివారణ చర్యలు కనుగొనటానికి రెండు మాసాల వ్యవధి కావాలని ముఖ్యమంత్రి చెప్పినట్లు రాయబారవర్గంలోని ప్రతినిధి ఒకరు తరువాత తెలియజేశారు. ధరలు పెంచవద్దని హోటల్ యజమానులను కోరినట్లు కూడా చెప్పారు.

రాష్ట్ర ఆహార సలహాసంఘంలో సమాఖ్య ప్రతినిధికి కూడా స్థానం యివ్వటానికి ప్రభుత్వం అంగీకరించిందని కూడా ఆ ప్రతినిధి తెలియజేశారు.

ఈ సమాఖ్యలో నలభయివేలమంది సభ్యు లున్నారు. ఇందులో పన్నెండు వేలమంది బొంబాయి పట్టణానికి చెందినవారు.

లక్నోలో అఖిపక్ష చర్చలు

రాష్ట్రంలోని ఆహార పరిస్థితిని చర్చించ టానికి ముఖ్యమంత్రి శాసనసభా ప్రతిపక్ష నాయకులతోసహా, కొంతమందికాంగ్రెస్‌సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆహార ధాన్యాల వ్యాపారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ, రాష్ట్రవ్యాపితంగా రేషనింగ్ ప్రవేశ పెట్టాలని ప్రతిపక్ష నాయకులు ఆ సమావేశంలోచేసిన సూచనలలో ఉన్నాయి.

ఈ సమావేశం అరగంటలకు పైగా జరిగింది. తమ అభిప్రాయాలను సమావేశంలో నిర్మొగమాటంగా వ్యక్తపరచినట్లు అధికార ప్రతినిధి ఒకరు తెలియజేశారు.

అందరి సహకారం సంపాదించి ఆహార సమస్యను పరిష్కరించాలని అందరూ అభిప్రాయ పడ్డారు.

రాష్ట్రప్రభుత్వం రాజీనామా యివ్వాలని సోషలిస్టు గ్రూపునాయకుడు సమావేశంలో డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.

ముఖ్యమంత్రి కోరినట్లయితే తాను రాజీనామా యివ్వటానికి సిద్ధంగా ఉన్నానని ఆహార మంత్రి శ్రీ జగ్‌మోహన్‌సింగ్ నేగి తెలియజేశారు.

దిగుమతి చేసుకున్న గోధుమలను ఉత్తర ప్రదేశ్‌కు కేంద్రప్రభుత్వం కేటాయించినట్లయితే ప్రస్తుత కొరతనుండి తప్పుకోవచ్చునని ఆయన తెలియజేశారు.

దిగుమతి అయిన గోధుమలలో రాష్ట్రానికి కేటాయించిన వాటిని పూర్తిగా యివ్వక పోవటంద్వారా రాష్ట్రంలోని ప్రస్తుత క్లిష్ట ఆహార పరిస్థితికి కేంద్ర ప్రభుత్వానిది కొంత బాధ్యత ఉందని ప్రతిపక్ష నాయకులు తెలియ జేశారు.

, కొరత పరిస్థితి పట్ల రాష్ట్రప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబించినందుకు కూడా వారు విమర్శించారు.

ఉత్తర ప్రదేశ్‌లో ఆహార కొరతకు బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని రాష్ట్ర ఆహార శాఖ మంత్రి శ్రీ జగ్‌మోహన్ సింగ్ నేగి చెప్పినట్లు తెలుస్తోంది.

మే నెలవరకూ ఆహార పరిస్థితి బాగానే ఉందనీ, కేంద్ర ప్రభుత్వం తన వాగ్దానం నెరవేర్చకపోవటంతో నెమ్మదిగా క్షీణించిందనీ, జనవరినుండి జూలై నెలవరకూ రాష్ట్రానికి కేటాయించిన 7.8 లక్షల టన్నుల ఆహార ధాన్యాలలో సగానికంటె తక్కువ సరఫరా చేసిందని తెలియజేశారు.

బీహార్‌లో రేషనింగ్

గ్రామీణ ప్రాంతాలలోనూ, పట్టణ ప్రాంతాలలోనూ ఆహార ధాన్యాల అమ్మకాన్ని క్రమబద్ధం చేయడానికి రేషన్ కార్డులను ప్రవేశ పెట్టాలని బీహార్ మంత్రివర్గం నేడు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

వ్యాపారస్తుల వద్దనున్న నిల్వలను పదిహేను రోజులకొకసారి తనిఖీ చేయాలనికూడా మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలుస్తోంది. సరియైన లైసెన్సులేకుండా ఆహార ధాన్యాల అమ్మకాన్ని నిషేధించాలనికూడా నిర్ణయం చేశారు.

జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలలో ధరలపై అజమాయిషీకి, సలహా యివ్వటానికి వెంటనే కమిటీలను ఏర్పాటు చేయాలనీ, ధరల స్థాయిని నిలబెట్టటానికి గ్రామ పంచాయతీల భారత సేవక్ సమాజ్ వంటి సంస్థలసేవలను ఉపయోగించుకోవాలనీ కూడా నిర్ణయించారు.

జైపూర్‌లో కేంద్ర ఆహారమంత్రి

కేంద్ర ఆహార, వ్యవసాయశాఖ మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం అహమ్మదాబాద్ నుండి నేటి సాయంత్రం యిక్కడకు వచ్చారు.

తృతీయ ప్రణాళికా కాలంలో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన వ్యవసాయ పెంపుదల పథకం గురించి రాష్ట్ర మంత్రివర్గ సభ్యులతో యిక్కడ ఉన్న కాలంలో చర్చలు జరుపుతారు. రాష్ట్రంలోని ఆహార పరిస్థితి [illegible] కూడా సమీక్ష చేస్తారు.

ఉప్పుడుబియ్యం తయారీకి కొత్తపద్ధతి

కేంద్ర ప్రభుత్వ ఆహార శాఖ సూచన ననుసరించి, ఖర్చులు తగ్గించటానికి, నాణ్యం పెంచటానికి ఉప్పుడు బియ్యం తయారుచేసే నూతన పద్ధతిని యిటీవల పశ్చిమబెంగాల్‌లో ప్రవేశపెట్టారు.

ఆహారశాఖా నిపుణులు కొంతకాలంగా యీ నూతన విధానంపై పరిశోధన చేస్తున్నారు.

ఈ నూతన పద్ధతి వలన ధాన్యం నానవేసే కాలం ముప్పై గంటల నుండి అయిదు గంటలకు తగ్గుతుందని నిపుణులు తెలియజేశారు. ఇందుమూలకంగా బియ్యం నాణ్యత పెరుగుతుంది. ఖర్చులు తగ్గుతాయి. బియ్యం నూకలు అయ్యే శాతాన్ని కూడా తగ్గిస్తుంది.

మహారాష్ట్ర-మైసూరు సరిహద్దు సమస్య

శ్రీ నందాతో చర్చిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వెల్లడి

బొంబాయి, జూలై 18

మహారాష్ట్ర- మైసూరురాష్ట్రాల సరిహద్దు సమస్యను గురించి, కేంద్ర హోంశాఖామంత్రి శ్రీ నందా ఆగస్టు 1,2 తేదీలలో బొంబాయి వచ్చినప్పుడు చర్చిస్తానని ముఖ్యమంత్రి శ్రీ వి. పి. నాయక్ నేడు మహారాష్ట్ర శాసన మండలిలో తెలియజేశారు.

మైసూరు రాష్ట్రంలోని మరాఠీ భాష మాట్లాడే ప్రాంతాలను మహారాష్ట్రలో కలపాలనే సమస్యపై పెజంట్సు అండ్ వర్కర్సు పార్టీ సభ్యుడు శ్రీ ఎస్. ఎస్. సావంత్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ ముఖ్య మంత్రి యీ విషయం చెప్పారు.

ఆగస్టు 15 నాటికి ఈ సమస్య పరిష్కారానికి మార్గాన్ని కనుగొనటానికి తన సర్వశక్తులా ప్రయత్నిస్తానని, బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు వచ్చినప్పుడు శ్రీ నందా, మహారాష్ట్ర ఏకీకరణ సమితి అధ్వర్యాన నిరశనదీక్ష సాగించినవారికి, హామీ ఇచ్చారని ముఖ్యమంత్రి తెలియజేశారు.

తాను యీ సమస్యా పరిష్కారానికి మార్గం చూపలేకపోయినట్లయితే, వీలైనంత త్వరగా పరిష్కారం కావటానికి కాంగ్రెస్ అధ్యక్షునికి యీ సమస్యను అప్పగిస్తానని కూడా శ్రీ నందా హామీ యిచ్చారనిచెప్పారు.

శ్రీ నందా పశ్చిమ జోనల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనడానికి బొంబాయి వస్తారని శ్రీ నాయక్ తర్వాత పత్రికా విలేకరులకు తెలియజేశారు.

రాయదుర్గంలో ధరల పెరుగుదల

రాయదుర్గం, జూలై [illegible]

రాయదుర్గంనుంచి యం. ఊలెప్పగారు యీ క్రింది ప్రకటన చేస్తున్నారు.

రాయదుర్గం 30 వేల జనాభా కలిగిన పట్టణం. అధిక సంఖ్యాకులు చేనేత పనివారు, కూలి ప్రజలు. దిన సంపాదన మనిషికి రూ 1-25 లు.

ఇక్కడ రోజు రోజుకి ఆహార, ధాన్యాల ధరలతోపాటు నిత్యజీవిత వస్తువుల ధరలు చుక్కలంటుతున్నవి. సామాన్య ప్రజల ఆదాయానికి, అధిక ధరలకు పొంతన లేకుండా పోతున్నది.

కష్టించి రెక్కలు ముక్కలు చేసుకొన్నా కడుపు నిండదు. దిన సంపాదన అంతాకూడా తిండికే చాలడంలేదు. పిన్నలు పెద్దలు వృద్ధులు సహితం పని చేస్తున్నా కుటుంబములో ఏ ఒక్కరికీ తినగలిగినంత తిండి లేదు. వారంలో రెండు మూడు పూటలు పస్తులుంటున్నారు.

పేరుకు మాత్రం ప్రభుత్వం వారు ఇక్కడ అయిదు చౌకడిపోలను పెట్టించారు. కాని ధాన్యం సప్లయి సరిగా జరగడంలేదు. డిపోల దగ్గర జనం పనులు విడచి కేవలం, రెండు సేర్ల బియ్యం కోసము గంటలకొద్ది పడిగాపులు పడివుంటున్నారు. అయినా ధాన్యం అందరికీ న్యాయంగా పంపకం జరగదు. డిపోదారులు సగానికి సగం బియ్యం ఎక్కువ ధరలకు రహస్యంగా అమ్ముకొనుచున్నారు. డిపోలలో జరిగే అన్యాయాల్ని అక్రమాలను స్థానిక అధికారులకు మనవి చేసుకొన్నా ఫలితం లేకుండా పోతున్నది. కాబట్టి పై అధికారులు ఈ విషయాన్ని గమనించి ఈ పట్టణంలో ఎక్కువగా చౌకడిపోలను తెరపించి పేదసాదలకు, చౌకగా ఆహార, ధాన్యాలను అందిచ్చే ఏర్పాట్లను గావించవలెనని కోరుచున్నాము. చౌకడిపోలలో అక్రమాలు అన్యాయాలు జరుగకుండేందుకు వెంటనే ఈ క్రింది కనపరచిన చర్యలుతీసుకోవలసిందిగా కోరుచున్నాము.

1. పట్టణంలో ప్రతివార్డుకు ఒక డిపోను పెట్టించవలెను.
2. అన్నిడిపోలకు చాలినన్ని బియ్యం, జొన్నలు, కందిపప్పు, చక్కెరవగైరా సప్లయి చేయవలెను.
3. ప్రతి కుటుంబానికి లేక యింటికి, ఒక కార్డుపద్ధతిని ప్రవేశపెట్టవలెను.
4. డిపోలలో, ఖచ్చితంగా, బియ్యాన్ని యితర ధాన్యాలను, తూనిక పద్ధతిలో యిచ్చే ఏర్పాటుచేయించవలెను.
5. ప్రతి డిపోకున్నూ, అధికార,అనధికార కమిటీలను ఏర్పరచి సక్రమంగా పంపకం అయ్యేలాగున చూడవలెను.

అహమ్మదాబాద్‌లో

దేశం మొత్తానికి ఒకే ఆహారవిధానాన్ని రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఆహారశాఖా మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం నేడిక్కడ తెలియజేశారు.

వచ్చే పంటకాలం లోపల యీ విధానాన్ని రూపొందించగలమని ఆశిస్తున్నామని కూడా శ్రీ సుబ్రహ్మణ్యం పత్రికా విలేకరులకు తెలియ జేశారు.

అటువంటి జాతీయ విధానం ఏదైనా, ఉత్పత్తిదారునకు గిట్టుబాటైన ధర, మధ్య వ్యాపారులకు న్యాయమైన లాభం, కొనుగోలు దారుకు చౌకధర ఉండేటట్లు ఏర్పాటు ఉంటుందని శ్రీ సుబ్రహ్మణ్యం వివరించారు.

అటువంటి విధానం మూలకంగా, దేశంలోని వివిధ ప్రాంతాలలోని ఆహారధాన్యాల ధరల లోని వ్యత్యాసాన్ని తగ్గిస్తుందన్నారు.

మధ్య దళారీల సంఖ్యను తగ్గించడానికి ప్రతిచర్య తీసుకుంటామన్నారు.

ఆఫ్రికా శిఖరాగ్ర సమావేశ నిర్ణయాలకు తాము కట్టుబడి ఉండాల్సిన పనిలేదని కాంగో ప్రభుత్వం ప్రకటించింది.

• • •

మహారాష్ట్ర గవర్నర్ శ్రీమతి విజయలక్ష్మీ పండిట్, ప్రధాని శాస్త్రిని కలుసుకుని సంభాషణలు జరిపారు.

క్యూబాపై "సమష్టి" చర్యలకు అమెరికా ప్రేరణ :

అమెరికారాజ్యాలసభలో రస్క్ ప్రసంగం

వాషింగ్టన్, జూలై 22

క్యూబాలోని కాస్ట్రో ప్రభుత్వాన్ని పడద్రోయడానికి పశ్చిమార్ధగోళ (ఉత్తర, దక్షిణ అమెరికాలు) దేశాలన్నీ కలిసి పూనుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి డీన్‌రస్క్ నేడు అమెరికా రాజ్యాలసంఘం విదేశాంగ మంత్రుల సమావేశంలో ప్రసంగిస్తూ పురికొల్పారు.

క్యూబాపై వెనిజులా ప్రభుత్వం చేసిన ఫిర్యాదును చర్చించేందుకు ఈ విదేశాంగ మంత్రుల సమావేశం వాషింగ్టన్‌లో జరుగుతూంది. ఆ సమావేశంలో ఈ వేళ ప్రసంగిస్తూ, క్యూబా నిరంతరం దురాక్రమణ చర్యలను సాగిస్తూందని రస్క్ ఆరోపించారు. దౌర్జన్యాలూ, గెరిల్లా పోరాటాలూ, ఆయుధాలనూ, విధ్వంసకులనూ దారపెట్టడమూ కమ్యూనిస్టుల పద్ధతులని ఆయన వ్యాఖ్యానించారు. "ఇటువంటి పద్ధతులతో విప్లవాన్ని ఎగుమతి చేయడానికి కాస్ట్రో ప్రభుత్వం చేస్తున్నప్రయత్నాలను అమెరికా ఖండం దేశాల ప్రభుత్వాలు ఇంకెంత మాత్రమూ సహించవని స్పష్టంచేయవలసిన సమయం ఆసన్నమయిందని" అన్నారు.

వెనిజులాలో "ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి కాస్ట్రో ప్రయత్నిస్తున్నారని" కూడా రస్క్ తన ప్రసంగంలో ఆరోపించారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు :

దీనివల్ల అమెరికా దేశంపై అరిచి కాస్ట్రో ప్రభుత్వానికి తెలియజేయగల చర్యలను తీసుకోవాలి. అంతేగాక విధించకుండా కాస్ట్రో ప్రభుత్వాన్ని. ఈ జోక్యం కొనసాగించేందుకు వదలిపెట్టకూడదు. విదేశాంగమంత్రులు ఆమోదించే ఆంక్షలు ఒక్క కాస్ట్రో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాత్రమే ఉండాలి. మరే ఇతరదేశానికి వ్యతిరేకంగా ఉండకూడదు.

విధ్వంసక చర్యలను మొండిగా కొనసాగించినట్లయితే, ప్రాంతీయ భద్రతా వ్యవస్థ మూలశక్తిని ప్రయోగిస్తామని కాస్ట్రో ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికచేయాలి.

(ఈ వ్యవస్థకు సంబంధించిన ఒడంబడిక ప్రకారం అమెరికా రాజ్యాల సంఘ సభ్యుల్లో మూడింట రెండువంతులమంది గనుక అనుకూలిస్తే దుమ్మడిగా సైనిక, ఆర్థిక, దౌత్యాంక్షలను అమలుచేయవచ్చు. ఈ ఒప్పందాన్ని పురస్కరించుకునే వెనిజులా ప్రభుత్వం క్యూబాపై ఫిర్యాదుచేసింది.)

అమెరికా దేశాలన్నీ క్యూబాతో దౌత్య సంబంధాలూ, వర్తకాన్నీ తెంచుకోవాలి. ఆర్థిక ఆంక్షలు ప్రయోగించాలి. వెనిజులా విదేశాంగమంత్రి అంతకుముందుతనఫిర్యాదును ప్రవేశ పెడుతూ డిమాండు చేశారు.

రస్క్ తన ప్రసంగంలో, ఈ చర్యలు పేర్కొనకుండా, "సోదర వెనిజులా ప్రభుత్వ విజ్ఞప్తిని పాటించి, సమష్టి చర్యలు తీసుకోవడం తమ విద్యుక్త ధర్మం అని అన్నారు.

కీలుబొమ్మల ప్రతిపాదన

క్యూబాతో దౌత్య, వర్తక, రవాణా సంబంధాలను తెంపుకోవాలని, ఈ ఆంక్షలను సభ్యదేశాలన్నీ ఏకీ అమలు జరపాలని కోరుతూ అమెరికా రాజ్యాల సంఘంలోని కోస్టారికా, కొలంబియా, పనామా దేశాల ప్రతినిధులు గతరాత్రి ఒక ప్రతిపాదన చేశారు.

వెనిజులాపై దురాక్రమణ చర్యలను, పోరాటాన్ని సాగిస్తున్నదంటూ ఈ ప్రతిపాదనలో క్యూబా ప్రభుత్వాన్ని విమర్శించారు.

క్యూబా ప్రభుత్వం "ఈ ఖండం శాంతి భద్రతలకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి అంతమయిన తరువాత" ఈ ఆంక్షలను తొలగించవచ్చునని ఈ తీర్మానంలో పేర్కొన్నారు.

సంయుక్త సోషలిస్టు పార్టీ సభ్యత్వానికి డా॥ లోహియా విముఖత

న్యూఢిల్లీ, జూలై 22

కాంగ్రెసుప్రభుత్వాన్ని ఓడించేందుకు ఇతర రాజకీయపార్టీలతో ఒప్పందాలు చేసుకునే పద్ధతులను ఆరోపించవలసినదిగా సంయుక్త సోషలిస్టుపార్టీ కార్యవర్గానికి డా॥ రామమనోహరలోహియా విజ్ఞప్తిచేశారు.

కొంచెం మతతత్వంతో కూడిన జనసంఘంగాని, కొంతమేరకు విదేశాలకు విధేయత చూపే కమ్యూనిస్టుపార్టీగాని, కొన్ని విషయాలలో అభివృద్ధి నిరోధకమైన స్వతంత్రపార్టీగాని కాంగ్రెసుపార్టీ అంత ప్రమాదకరమైనవి కావని సంయుక్తసోషలిస్టుపార్టీ కేంద్ర కార్యాలయం నుండి వెలువడిన ప్రకటనలో డాక్టర్ లోహియా పేర్కొన్నారు. డా॥ లోహియా సంయుక్త సోషలిస్టు పార్టీలో లాంఛన ప్రాయంగా చేరలేదు. కాంగ్రెసుపార్టీ కుటుంబ విధివిధాన సర్వం అని డా॥ లోహియా చెప్పారు.

ఇతర పార్టీలతో కలిసి కాంగ్రెసు పార్టీ ప్రభుత్వాన్ని పడగొడితే మంచి మార్పే సాధించబడ్డట్లుగా డా॥ లోహియా తెల్పారు. సంయుక్త సోషలిస్టుపార్టీలో విశ్వాసం, అస్పష్ట స్వభావులు ఉన్నంతకాలం ఆ పార్టీతో నాకెట్టి సంబంధం ఉండబోదన్నారు.

సంయుక్త సోషలిస్టు పార్టీ కార్యవర్గ సభ్యుల ప్రవర్తన పార్టీలో సభ్యునిగా చేరదలచుకోని తన నిర్ణయాన్ని ధృవపరుస్తుందని డా॥ లోహియా తన ప్రకటనలో పేర్కొన్నారు.

కైరో శిఖరాగ్ర సభ నిర్ణయాలు

కైరో, జూలై 22

ఆఫ్రికా రాజ్యాల శిఖరాగ్రసభ ఏర్పరచిన శాశ్వత సెక్రెటేరియట్‌లో, సెక్రటరీ జనరల్‌కు సహాయంగా నల్గురు కార్యదర్శులు ఉండాలని, అల్జీరియా, దహోమీ, కీన్యా, నైజీరియా దేశాలు వీరిని నామినేట్ చేయాలని కూడా సభ తీర్మానించింది. (ఈ మహాసభ నిర్ణయాలను కొన్నిటిని నిన్ననే ఇచ్చాము. మిగతావి నేడిస్తున్నాము. —వి. సం.)

ఆఫ్రికా దేశాలలోని విమోచనోద్యమాలకు అండగా సాధన సంపత్తులను సమన్వయం చేసే విమోచన కమిటీకి మరింత సహాయం చేయటానికి శిఖరాగ్ర సభ ఆమోదించినట్లు తెలుస్తోంది.

నిషేధించబడిన దక్షిణాఫ్రికా జాతీయ కాంగ్రెసు శిఖరాగ్ర సభకు ఒక మెమోరాండంను సమర్పించిందని, వారికి కావలసిన సహాయాన్ని అందుకో పేర్కొన్నామని ఆ పార్టీ ప్రతినిధి రెంబ్బరెషా తెలియచేసారు.

తటస్థదేశాల మహాసభకు రెండు దేశాలు మినహా అన్నిదేశాలు హాజరవుతున్నాయని శిఖరాగ్రసభ ప్రతినిధి ఒకరు తెలియ చేసారు.

దక్షిణ రొడీషియాలో శ్వేతజాతి మైనారిటీ ప్రభుత్వం ఏకపక్షంగా స్వాతంత్ర్యం ప్రకటించే పక్షంలో తీవ్ర, కఠిన చర్యలు తీసుకొనగలమని శిఖరాగ్ర సభ శపథం తీసుకొంది.

అటువంటి పరిణామాలు ఉత్పన్నమయితే ప్రవాస ఆఫ్రికా జాతీయ ప్రభుత్వం ఏర్పడ్డట్లు ఆ దేశానికి బలపరచడంతో సహా తగిన చర్యలు తీసుకొనగలమని శిఖరాగ్ర సభ హెచ్చరించింది.

ఒక వ్యక్తికి ఒకవోటు ప్రాతిపదికపై మెజారిటీ ప్రభుత్వం ఏర్పడటానికి గ్యారంటీ ఇచ్చే ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని తయారు చేసేందుకు దక్షిణ రొడీషియాలో అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులను వెంటనే సమావేశపరచవలసిందిగా బ్రిటిష్ ప్రభుత్వానికి శిఖరాగ్ర సభ విజ్ఞప్తి చేసింది.

సర్వసత్తాక స్వాతంత్ర్య లక్ష్యై తమ పోరాటాన్ని తీవ్రం చేయవలసిందిగా దక్షిణ రొడీషియాలో జాతీయోద్యమాలకు శిఖరాగ్ర సభ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

బహిరంగ సమావేశంలో అధ్యక్షుడు నాజర్ ప్రసంగిస్తూ, నెల్సన్ మాండెలా లాంటి వీరులకు అండగా యావత్తు ఆఫ్రికా ఖండం ఉందని ఉద్ఘాటించారు.

ఆఫ్రికా ఏదో ఏకాకియైపోయిన ఖండం కాదని ఆసియా, దక్షిణ అమెరికా ఖండాలు, యావత్తు ప్రపంచానికి ఈ శిఖరాగ్ర సభ చాటి చెప్పగలదని ఆయన అన్నారు.

భారత రాజ్యాంగంలో ముస్లింలకు సమాన హక్కులు

శ్రీ నందా స్పష్టీకరణ

కరాచీ, జూలై 22

భారతదేశంలో దాదాపు 5 కోట్లమంది ముస్లిం ప్రజలు ఇతర పౌరులతో సమాన హక్కులను అనుభవిస్తున్నారని భారత హోంమంత్రి శ్రీ నందా పాక్ విదేశాంగమంత్రికి వ్రాసిన ఒకలేఖలో స్పష్టం చేశారు.

శ్రీ నందా తన లేఖలో ఇంకా ఈవిధంగా ప్రకటించారు :

"జాతి మత తదితర వివక్షలేకుండా మా రాజ్యాంగం అందరికీ సరిసమాన హక్కులను హామీ యిచ్చింది. ఈ హామీని సమర్థవంతమైనదని మేము భావిస్తున్నాం."

పాక్ విదేశాంగమంత్రి ఖాన్ హబిబుల్లా ఖాన్ గత నెల 24 వ తేదీన రాసిన లేఖకు సమాధానంగా ఈ నెల 13 వ తేదీన శ్రీ నందా రాసిన లేఖలో పైవిధంగా వివరం చేశారు.

ఈ ఉభయ లేఖలను నేడు విడుదలచేశారు.

"మన ప్రభుత్వాలు నాగరిక ప్రభుత్వాలుగా పరిగణించ బడడాన్ని సార్థకం చేయాలంటే మైనారిటీ జాతీయులను కాపాడ గలిగివుండాలి" అన్న హబిబుల్లాఖాన్ అభిప్రాయంతో శ్రీ నందా ఏకీభవించారు.

అస్సాంనుండి ఖాళీ చేయించేవారి విషయమై గతంలో జరిగిన భారత-పాక్ హోం మంత్రుల సమావేశంలో పూర్తిగా చర్చించడం జరిగిందని శ్రీ నందా తెలియజేశారు.

"ఈ విషయంలో మా అభిప్రాయ మేమిటో మీకు బాగా తెలుసు. ఒక్క భారతీయునిని కూడ బయటికి నెట్టబోము. ఏ ఒక్కడిని వేధించము."

మైనారిటీ జాతీయుల, ధన మాన ప్రాణాలకు రక్షణ కల్పించవలసినదిగా పాకిస్తాన్ ప్రభుత్వం యిచ్చిన ఆదేశాలను క్రింది స్థాయిలోని స్థానిక అధికారులు అలక్ష్యం చేయకుండా ఉండేందుకై తాపీ మధ్య తూర్పు పాకిస్తాన్‌లో పర్యటించానని హబిబుల్లాఖాన్ తన లేఖలో ప్రస్తావించారు.

భారతదేశం నుండి ముస్లింలు పాకిస్తాన్‌కు వస్తున్నంతవరకూ తూర్పు పాకిస్తాన్‌లోని హిందువులకు భీతావహం వుండేమాట నిజమేనని పాక్ హోంమంత్రి తన లేఖలో చెప్పారు.

అదే విధంగా భారతదేశంలోని ముస్లిములకూడా భీతావహానికి లోనుకాకతప్పదని కూడా హబిబుల్లా తెలియజేశారు.

"ఎల్లప్పు భారతదేశంలో మత కల్లోలాలకు గురిమైనప్రాంతాలను పర్యటించ వలసినదిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. అక్కడ మైనారిటీ జాతీయులైన ముస్లింలలో విశ్వాసాన్ని, భద్రతాభావాన్ని కలిగించే నిమిత్తం సరి అయినచర్యలు తీసుకోవలసినదిగాకూడా కోరుతున్నాను" అని శ్రీ హబిబుల్లా తన లేఖలో రాశారు.

ఆంధ్ర నాటక కళా పరిషత్తు

26 వ తేదీ సాయంత్రం గుడివాడలో కార్యవర్గ సమావేశం

గుడివాడ, జూలై 17

ఆంధ్ర నాటక కళా పరిషత్తు ప్రధాన కార్యదర్శి శ్రీ పసల సూర్యచంద్రరావుగారు యిలా వ్రాస్తున్నారు :

"ఆంధ్ర నాటక కళాపరిషత్తు సలహా కార్యవర్గ సభ్యుల సమావేశం 26-7-64 ఆదివారం సాయంత్రం 3 గంటలకు గుడివాడ శరత్ టాకీసులో జరుగును. గాన సభ్యులెల్లరు తప్పక విచ్చేయ ప్రార్థన. చర్చనీయాంశములు : 1. ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక ఏకాడమీ వారి సూచన ననుసరించి విజయవాడలో 'నాట్య విద్యాలయము'ను నిర్వహించుట గురించి. 2. కార్యదర్శి ప్రవేశ పెట్టు ఇతరవిషయములు.

ఒరిస్సాకు బర్మా కాందిశీకులు

పునరావాసానికి రాష్ట్రప్రభుత్వ యత్నాలు

భువనేశ్వర్, జూలై 22

బర్మానుండి వస్తున్న దాదాపు ఆరువేల మంది భారతీయులకు "సముచితమైన" పునరావాసం కల్పించేందుకు ఒరిస్సా ప్రభుత్వం ఏర్పాట్లను చేస్తున్నదని రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి ఒకరు తెలియజేశారు.

ఒరిస్సాలో స్థిరనివాసం కోసం వస్తున్నవారు ప్రయాణంచేస్తున్న ఒకనౌక విశాఖ రేవును ఆగస్టు 11 వ తేదీకి చేరుకుంటున్నదనీ, రెండో నౌక ఆగస్టు 18 వ తేదీన చేరుకుందని ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు.

విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ డిప్యూటీ కార్యదర్శి శ్రీ అలెగ్జాండర్ గత వారంలోనే భువనేశ్వర్‌ను సందర్శించి, భారతీయ నిర్వాసితుల పునరావాసానికి సంబంధించిన సమస్యలను గురించి రాష్ట్ర ప్రభుత్వముతో చర్చించి వెళ్లారు.

"నేనలా అనలేదు"

తన పాట్నా ప్రసంగంపై బిజూ పట్నాయక్ ప్రకటన

భువనేశ్వర్, జూలై 22

కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీ బిజూ పట్నాయక్ నేడు ఈ క్రింది పత్రికా ప్రకటన చేశారు:

పాట్నాలో జూలై 20 వ తేదీన ఈక్రింది విధంగా నేను అన్నట్లు పత్రికల్లో వార్త వచ్చింది.

"నానాటికి పెరిగిపోతున్న ధరలనుండి, కాంగ్రెసు పార్టీ యితర వైఫల్యాలనుండి ప్రజలదృష్టిని మరల్చడానికి లంచగొండితనం అనే బూచిని కాంగ్రెసు లేవదీసిందని నేడిక్కడ ఒరిస్సా మాజీ ముఖ్యమంత్రి శ్రీ బిజూపట్నాయక్ అన్నారు."

ఆ విధంగా నేను చెప్పివుండలేదు. నేను చెప్పిన దేమంటే వాస్తవ సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడం మామూలుగా స్వార్థప్రయోజనాలుగలిగిన రాజకీయవాదుల అలవాటు అని మాత్రమే. ఈనాడు మన దేశంలో పెరుగుతున్న ధరలను అరికట్టడానికి, ఉత్పత్తి పెంచడానికి, జాతీయ సమైక్యతను సాధించడానికి, లంచగొండితనాన్ని నిర్మూలించడానికి పోరాటాన్ని సాగించుతున్నది. కాని తదితర ప్రధాన సమస్యలన్నింటినీ విడిచిపెట్టి ఒక్క లంచగొండితనాన్ని కుదముట్టించడానికే మన శక్తినంతటినీ వినియోగించితే కాంగ్రెసుకు శత్రువులుగా వున్నవారికి కాంగ్రెసుపార్టీ ప్రధానమైన జాతీయ సమస్యలను పరిష్కారం చేయడంలో విఫలమైనదని ప్రచారం చేయడానికి ఒక సాధనం ఇచ్చిన వారమవుతాం. లంచగొండితనాన్ని అన్ని స్థాయిల్లోనూ ఎదుర్కొనవలసిందే. కాని లంచగొండితనాన్ని నిర్మూలించడంలో మనం నిమగ్నమై, అంతే ప్రాధాన్యంగల ఇతర సమస్యలను వదలివేయరాదు.

ప్యారిస్‌లో విశ్వవిద్యాలయాల ప్రాంతంలో భారత విద్యార్థుల గృహం నిర్మించడానికి ఒక కాంట్రాక్టుపై ఫ్రాన్సులోని భారత రాయబారి సంతకం చేశారు.

నాలుగు తరగతులుగా గ్రామీణ ప్రాంతాల విభజన

4 వ ప్రణాళికలో ఏర్పడనున్న పథకంపై శాసనమండలిలో ముఖ్యమంత్రి వివరణ

హైదరాబాద్, జూలై 23

నాల్గవ పంచవర్ష ప్రణాళికలో గ్రామీణ ప్రాంతాలను, ఆయా ప్రాంతాలకు పొందిన అభివృద్ధి కార్యక్రమాలనుబట్టి నాల్గు తరగతులుగా విభజించుతామని శాసన మండలిలో నేడు పంచాయతీ సమితుల, జిల్లా పరిషత్తుల సవరణ బిల్లుపై చర్చలో ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు తెలియజేశారు.

ఆయా ప్రాంతాలకు అభివృద్ధి కార్యక్రమాలనుబట్టి ఆర్థిక సహాయంచేసే విషయం నిర్ణయిస్తామని ముఖ్యమంత్రి తెలియ జేశారు.

తెలుగు టైపు రైటర్

ఆంధ్ర ప్రభుత్వం కలకత్తాలో రెమింగ్టన్ కంపెనీచే తయారు చేయించుతున్న తెలుగు టైప్ రైటర్ సెప్టెంబరు 1 వ తేదీకి సంసిద్ధం అవుతుందనీ, ఈ టైప్‌రైటర్‌ను పరిశీలించి అప్పుడు అవసరమైన మార్పులు, అందులో చేయవచ్చునని శాసన మండలి ప్రశ్నోత్తరాలసమయంలో నేడు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి తెలియ జేశారు.

నైవెల్లి విద్యుచ్ఛక్తి కేంద్రం

సోవియట్ సహకారంతో విస్తరణ

న్యూఢిల్లీ, జూలై 23

నైవెల్లి విద్యుచ్ఛక్తి కేంద్రం మొదటి దశ పూర్తయిన సందర్భంలో ఆగస్టు 5 న జరుగనున్న సభకు కేంద్ర ఉక్కుగనులశాఖమంత్రి శ్రీ సంజీవరెడ్డి అధ్యక్షత వహిస్తారు.

ఈవిద్యుచ్ఛక్తి కేంద్రనిర్మాణం 2 సంవత్సరాలలో ముగిసింది. 1962 మేలో ప్రారంభమై 64 ఏప్రిల్ 29 తో నిర్మాణం ముగిసింది.

1964 జూన్ 24 నకు ఈ విద్యుచ్ఛక్తి కేంద్రం 1706 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేసింది. 1344 మిలియన్ యూనిట్లు మద్రాసుకు, మిగిలిన విద్యుచ్ఛక్తి నైవెల్లి ప్రాంతానికి ఉపయోగించారు.

సోవియట్ ఆర్థిక, సాంకేతికసహకారంతో ఈ విద్యుచ్ఛక్తి కేంద్రం ఏర్పాటుచేయబడింది.

14.5 కోట్ల రూపాయలు ఈ కేంద్ర నిర్మాణానికి ఖర్చుచేయబడ్డాయి. భారతదేశంలో విద్యుచ్ఛక్తి కేంద్రం ఇది ఒక్కటే. 250 యం. డబ్ల్యు. శక్తినుండి, 400 యం. డబ్ల్యు శక్తి. మరల 600 యం. డబ్ల్యు శక్తి కి ఈ కేంద్రం విస్తరించబడింది. ఈ విస్తరణ కార్యక్రమం సోవియట్ సహకారంతో నిర్వర్తింపబడింది.

శ్రీ వేంకటేశ్వర ఎం.ఏ. పరీక్షా ఫలితాల్లు

తిరుపతి, జూలై 21

ఎం.ఏ. పార్టు II ఫైనల్

బ్రాంచి 5 (A) ఇంగ్లీషు

ఒకటవ తరగతి: లేదు.

రెండోతరగతి: 140 నుండి 43 45 47 నుండి 54.

యం. బి. బి యస్. పార్టు II

మొదటి సంవత్సరం

క్రొత్త నిబంధనలు, ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీ

1 నుండి 5 7 8 10 నుండి 14 16 19 21 23 24 25 28 నుండి 32 36 నుండి 40 42 నుండి 52 56 57 58.

బుచ్చయ్యగారిపల్లెలో భూస్వామి దౌర్జన్యాలు

బుక్కపట్నం, జూలై 16

అనంతపురంజిల్లా పెనుగొండ తాలూకా బుచ్చయ్యగారిపల్లెలో పెద్ద భూస్వామి అవులాల ఐసిరెడ్డి పెద్ద రౌడీగుంపుతో పంచాయతీ ఎన్నికలలో తనను వ్యతిరేకించారనే కసితో గ్రామంలోని, కర్నాటకం రామప్ప, అశ్వత్థనారాయణరెడ్డి, తిప్పారెడ్డి మొదలగువారి ఇళ్ళపై దాడిచేయించాడు. రాళ్ళు దువ్వలూ, తిరుడూ, ఈటెలు, కర్రలు మొదలగు ఆయుధాలతో రౌడీగుంపు ఇళ్ళమీద పడింది.

ఈ వార్త అంది రెండు మైళ్ళదూరంలోని బుక్కపట్నంనుంచి పోలీసులు వెంటనే వచ్చారు.

ఈ సందర్భంలో పోలీసులు 10 మందిని అరెస్టుచేసి జామీనుపై విడుదలచేశారు.

సముద్ర గర్భంలో నూనె నిల్వలు

కలవని సోవియట్ శాస్త్రజ్ఞుల అభిప్రాయం

న్యూఢిల్లీ, జూలై 22

భారతదేశంలోని తీరప్రాంతాలలో నూనెగనుల పరిశోధనచేస్తున్న సోవియట్ భూగర్భ శాస్త్రజ్ఞులు సముద్ర గర్భంలో నూనెనిల్వలు కలవనే అభిప్రాయానికి వచ్చారు.

బంగాళాఖాతంలోనూ, కచ్‌గల్ఫ్‌లోనూ, పశ్చిమప్రదేశాలలోనూ నూనెనిల్వలు దొరకవచ్చునని విదేశ ఆర్థిక సంబంధాల ఉపసంఘం డిప్యూటీ చైర్మన్ లియోన్ గ్రిడ్లోవ్ నిన్నమాస్కో ఇంటర్వ్యూలో తెల్పారు.

ఈ విషయాన్ని నిర్ధారణ చేసుకునేందుకు 60 మంది నిపుణులతో కూడిన బృందం పరిశోధన చేస్తుంది.

సైప్రస్ సమస్యకు అంగీకారమైన పరిష్కారమార్గం కనుగొనబడుతుందని ఐరాసా ప్రధాన కార్యదర్శి యూథాంట్ తెలియజేశారు.

రేడియో

శనివారం, జూలై 25

శక 1886 శ్రావణ 3

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు: 6-40 అం. వా. 6-45 భక్తిరంజని: శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం; 6-55 సూక్తిముక్తావళి; 7-00 తె. వా: 7-15 సంగీత శిక్షణ: 7-30 వాద్య బృందం; 8-00 అం. వా: 8-15 ప్రాంజలి; 8-30 కె. ఆర్. లక్ష్మి: 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికుల కార్యక్రమం; 1-00 రేడియో కళాకారులు; 1-30 వార్తలు - వ్యాఖ్యలు: 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-00 వాతావరణ సూచన, బొమ్మరిల్లు: 3-00 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశం: 6-20 గ్రామస్థులకు; 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు; 7-30 శిల్పసుధామయి ఆనందింద అంటే - ప్రసంగం: 7-40 పల్లెపాట: 7-45 నాటిక (హై. బి.): 8-00 శ్రోతలు కోరిన పాటలు; 8-30 రేడియో న్యూస్‌రీల్: 8-45 లలిత సంగీతం: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా: 9-15 ఆంగ్లమున; 9-25 విరామ సంగీతం: 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమం: 11-05 సమాప్తి - జన గణ మన.

హైద్రాబాద్ - ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం: కార్యక్రమ వివరణ: 6-40 అం. వా: 6-45 భక్తిరంజని; 6-55 సూక్తి ముక్తావళి; 7-00 తె. వా: 7-15 సంకీర్తనం: 7-30 డి. కె. పట్టమ్మాళ్; 7-45 సుగం సంగీత్: 8-00 అం. వా: 8-15 8-15 విజయవాడవలె; 8-30 విజయవాడవలె; 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 11-45 మాధ్యమిక పాఠశాలలకు (ఉర్దూ): 12-15 హైదరాబాద్ బి వలె: 12-30 కార్మికుల కార్యక్రమం; 1-00 రేడియో కళాకారుల-కదంబ కార్యక్రమం; 1-30 స్వరవల్లరి: వాద్య కృతి నిలయ విద్వాంసులు: 1-40 హిం. వా: 1-50 తె. వా: 2-00 హై. బి. వలె: 2-10 ఉ. వా: 2-20 హైదరాబాద్ బి వలె: 2-30 సమాప్తి.

3-30 బాలానందం: 4-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు: 6-05 ప్రాం. వా: 6-15 ప్రస్తుతాంశం: 6-20 నవరస్: 7-00 తె. వా: 7-15 ప్రసంగము (హిందీ): 7-25 శ్రోతల ఉత్తరాలకు జవాబులు (ఉర్దూ): 7-30 చిత్రసీమ: 7-45 రెండు కప్పిటి చుక్కలు - నాటిక: 8-00 ప్రసంగం (ఉర్దూ): 8-10 హై. బి. వలె: 8-30 రేడియో న్యూస్‌రీల్: 8-40 విరామ సంగీతం: 8-45 ఈ మానవు పాట: 8-50 విరామ సంగీతం: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా: 9-15 ఉ. వా: 9-30 అఖిలభారత సంగీత కార్యక్రమ : 11-00 అం. వా: 11 05 సమాప్తి - జనగణమన.

హైద్రాబాద్ - బి

కడప

265.1 మీ (1130 కిలోసై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలోసై)

సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

89.42 మీ (3355 కిలోసై)

(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై.ఎ.వలె: 7.45 సమాప్తి.

49.02 మీ (6120 కిలోసై.)

8-00 హై. ఎ. వలె: 9-00 సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం: 11-45 కర్నాటక సంగీతం: 12-30 హై. ఎ. వలె: 2-00 వాతావరణ సూచన, టి. జి. పద్మనాభన్: 2-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఎ. వలె: 6-20 గ్రామస్థులకు: 7-00 తె. వా: 7-15 గ్రామస్థులకు: 7-30 హై. ఎ. వలె: 8-00 టి. జి. పద్మనాభన్: 8-30 హై. ఎ. వలె: 9-15 ఆంగ్లమున: 9-25 విరామ సంగీతం: 9-33 హై. ఎ. వలె: 11-05 సమాప్తి-జనగణమన.

మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలోసై)

60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40అం.వా: 6-45 మ.ఎ.వలె: 7-00 తె. వా: 7-15 సుప్రభాతం: 7-30 మ. ఎ. వలె: 8-00 అం. వా: 8-15 సమాప్తి.

211.3 మీ 1420 కిలో సై

41.90 మీ. 7160 కిలో సై

మధ్యాహ్నం: 1-00 కదంబం: 1-30 అం వా: 1-40 గీత మంజరి: 1-50 తె. వా: 2-00 సమాప్తి.

3-30 ముత్తుక్కువియల్: 4-30 పిల్లలకు: 5-00 సమాప్తి.

211.3 మీ (1420 కిలోసై)

60.98 మీ (4920 కిలోసై)

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం: 6-00 అం. వా: 6-05 ప్రాంతీయ శెయిదిగళ్: 6-20 వాతావరణ సూచన, స్థానికప్రకటనలు, వాణిజ్య వార్తలు (ఆంగ్లం): 6-30 కార్యక్రమ వివరణ (తమిళం): 6-35 వేణువు: 7-00 తె. వా: 7-15 సంగీతమాల: 7-30 నాటిక (తమిళం): 8-30 గౌరీరత్నం: 8-55 ప్రస్తుతాంశం: 9-00 అం. వా: 9-15 ఆంగ్లమున: 9-30 పుస్తక సమీక్ష: 9-40 విరామసంగీతం: 9-45 పాశ్చాత్య సంగీతం: 11-00 అం. వా: 11-05 సమాప్తి - జన గణ మన.

ఆంధ్ర విశ్వవిద్యాలయ యం. టెక్ ఫలితాలు

విజయవాడ, జూలై 22

యం టెక్ (కెమికల్ ఇంజనీరింగ్)

మొదటి శ్రేణి. 316 317.

రెండవ శ్రేణి లేదు :

ఐర్కనాప్: 316 317 318 139 320 321 322 323 323-A 324 325 326.

ట్రాన్స్‌పోర్టు ఫినామినా: 318 319 321 323 323-ఎ 325 326.

ప్రాసెస్ ఇంజనీరింగు : 325.

యూనిట్ ప్రాసెస్, ఆర్గానిక్ సింథసిస్ : 319 21 22 23 23-ఎ 24 25 26.

న్యూక్లియర్ మెటీరియల్స్ టెక్నాలజీ : 318 19 21 22 23 23-ఎ.

మౌఖిక పరీక్ష

319 21 22 23 23-ఎ 15.

బి. యస్‌సి. స్పెషల్

మొదటిసంవత్సరం పరీక్ష : 185.

బర్మానుండి 1501మంది కాందిశీకులు మద్రాసు రాక

మద్రాసు, జూలై 23

బర్మానుండి స్వదేశానికి వచ్చి వేస్తున్న 1501 మందితో కూడిన మొదటి బృందం నేడు ఉదయం ఇక్కడికి వచ్చారు.

వారు రేవులో దిగగానే వారికి టీ ఇచ్చి బస్సులలో కార్పొరేషన్‌స్కూలు భవనాల్లోకి తీసుకొని వెళ్ళారు.

వారు అక్కడ వుండటానికి ఏర్పాట్లు జరిగాయి.

మదురై, రామనాడ్‌జిల్లాలకు వెళ్ళదలచిన వారికి ఒక ప్రత్యేకరైలును ఏర్పాటుచేస్తున్నారు. ఆ జిల్లాల్లో బంధువులున్నవారు అక్కడికి వెళ్ళాలనే కోర్కెను వెలిబుచ్చారు.

మద్రాసు రాష్ట్రంలోని పశ్చిమ జిల్లాలకు, కేరళకు వెళ్ళగోరువారికి మామూలు రైళ్ళలో వెళ్ళడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

భారతదేశంలో బంధువుగాని, మిత్రుడుగాని లేనివారికి మద్రాసుకు 20 మైళ్ళ దూరంలో వున్న గుమ్మడిపూడిలోని శిబిరానికి పంపిస్తున్నారు. అక్కడవారి పునరావాసానికి ఏర్పాట్లు జరుగుతాయి.

బర్మా కాందిశీకులు వచ్చిన నౌక రేవుకు రాగానే పబ్లిక్ వర్క్సు శాఖా మంత్రి వారివద్దకు స్వయంగావెళ్ళి వారి యోగక్షేమాలను గురించి, ప్రయాణాన్ని గురించి విచారించారు.

వారంతా స్వదేశానికి తిరిగి వస్తున్నందుకు మొత్తంమీద వారు సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు మంత్రి శ్రీ రామయ్య చెప్పారు.

పంజాబు కాంగ్రెసులో విభేదాలు

ముఖ్యమంత్రికి, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షునికి మధ్య

చండీగఢ్, జూలై 22

గతంలో కాంగ్రెసునుండి విడిపోయి ప్రజాతంత్ర పార్టీని నెలకొల్పుకున్న 18 మంది శాసన సభ్యులను తిరిగి కాంగ్రెసులో చేర్చుకొనే విషయమై ముఖ్యమంత్రి శ్రీ రామకిషన్, హోమ్ మంత్రి శ్రీ దర్బారాసింగ్‌లకు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ భగవత్ దయాళ్‌శర్మకు మధ్య విభేదాలు ఏర్పడినాయి.

ప్రజాతంత్ర సభ్యులను చేర్చుకోవాలా లేదా అన్న విషయం ఇప్పుడు కాంగ్రెసు అధిష్టానవర్గం పరిశీలనలో వుంది.

వారిని కాంగ్రెసుపార్టీలోకి తిరిగి తీసుకోవాలన్న ప్రతిపాదనను ముఖ్యమంత్రి శ్రీ రామకిషన్ పూర్తిగా బలపరుస్తున్నారు.

శ్రీ దర్బారాసింగ్ చెపుతున్నదానినిబట్టి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులైన శ్రీ శర్మ వారిలో ఏడుగురిని తీసుకోవడానికి పూర్తిగా వ్యతిరేకం. మరోకంగా మరి కొందరి ప్రవేశానికికూడా వ్యతిరేకం.

ప్రదేశ్ కాంగ్రెసును అన్ని స్థాయిలలో పునర్నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి ఇటీవల చేసిన ప్రకటనను తాను పూర్తిగా బలపరుస్తున్నానని పత్రికా గోష్ఠిలో శ్రీ దర్బారాసింగ్ చెప్పారు. ప్రదేశ్ కాంగ్రెసు పునర్నిర్మాణంపై ముఖ్యమంత్రి డిమాండ్ న్యాయసమ్మతమైనదని శ్రీ దర్బారాసింగ్ చెప్పారు.

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ జూలై 22

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ మార్కెటింగు డైరెక్టరు నేడు అందజేసిన ఉత్పత్తిదారులనుండి 13-7-64న కొనుగోలుచేయబడిన టోకుధరలు (ఒకక్వింటాల్ 100కిలోగ్రాములు, లేక 220½ పౌనులు) :

ధాన్యం

(75 కిలో గ్రాములకు)

నంబర్లు:	విజయవాడ	రు. 48 00	36 00
"	కాకినాడ	48 00	36 00
"	చిత్తూరు	53 33	40 00
అక్కుళ్లు:	విజయవాడ	40 66	30 50
"	తాడేపల్లిగూడెం	42 00	31 50
"	కాకినాడ	44 00	33 00
"	ఆముదాలవలస	44 66	33 50
సన్నకృష్ణకాటుకలు:			
	తాడేపల్లిగూడెం	44 67	33 50
సన్నాలు:	ఆముదాలవలస	46 00	34 58
మొలకొలుకులు:	నెల్లూరు	47 64	36 10

మిల్లు బియ్యం

నంబర్లు:	విజయవాడ	రు. 82 00
"	కాకినాడ	79 71
అక్కుళ్లు:	విజయవాడ	65 00
"	తాడేపల్లిగూడెం	65 54
"	కాకినాడ	69 66
"	ఆముదాలవలస	69 76
సన్నకృష్ణ కాటుకలు:		
"	తాడేపల్లిగూడెం:	71 62
నంబర్లు:	చిత్తూరు	85 48
సన్నాలు:	ఆముదాలవలస	74 41
మొలకొలుకులు:	నెల్లూరు	78 50

వేరుశనగ

కాయలు	విజయవాడ	87 50
"	నంద్యాల	92 50
"	ఆదోని	97 50
"	విజయనగరం	85 33
పప్పు	విజయవాడ	125 00
"	నంద్యాల	116 25
"	ఆదోని	124 00
"	విజయనగరం	133 33
నూనె	విజయవాడ	245 00
"	నంద్యాల	237 50
"	ఆదోని	237 50
"	విజయనగరం	263 33

అపరాలు

కందులు:	విజయవాడ	రు. 81 00
"	గుంటూరు	82 00
"	ఆముదాలవలస	77 42
మినుములు:	విజయవాడ	73 00
"	గుంటూరు	70 00
"	ఆముదాలవలస	65 58
పెసలు:	విజయవాడ	85 00
"	గుంటూరు	88 00
"	ఆముదాలవలస	81 72
శనగలు:	విజయవాడ	70 65

జొన్నలు

అనంతపురం:	తెల్లవి	54 00
నంద్యాల:	పచ్చవి	47 00

బెల్లం

అనకాపల్లి:	మొదటిరకం	—
"	మూడవరకం	—
చిత్తూరు	మొదటిరకం	87 33
"	మూడవరకం	67 33

జీడిపప్పు

వేటపాలెం:	అమెరికన్‌రకం	రు. 705 00
"	దేశవాళి	659 00
"	బద్దలు	600 00
"	ముక్కలు	500 00

మిర్చి

నెం2 ఒకటవ రకం గుంటూరు	175 00
నెం రెండు 2వ రకం ..	165 00
నెం2 దర్జ రకం "	—

సభలు - సమావేశాలు

వరంగల్ తాలూకా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల సమావేశం యీ నెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు వరంగల్‌లోని జిల్లాపార్టీ కార్యాలయంలో జరుగుతుంది. తాలూకాలో వర్షాలు లేనందున ఏర్పడిన పరిస్థితిని, ఆహార ధాన్యాల ధరల పెరుగుదలవల్ల ఏర్పడిన పరిస్థితిని చర్చించి కార్యక్రమం తీసుకొనబడుతుంది. కావున తాలూకాలోని అన్ని బ్లాకులలోని కమిటీ సభ్యులు, గ్రామ శాఖల కార్యదర్శులు అంతా 26 వ తేదీ సాయంకాలానికి వరంగల్‌లోని జిల్లా పార్టీ కార్యాలయానికి రావలసినదిగా శ్రీ యస్. మోహనరావు ఎం. ఎల్. ఏ. ప్రకటిస్తున్నారు.

నెయ్యి

	పల్నాడు	దేశవాళి
గుంటూరులో	610 00	620 00

కొబ్బరికాయలు

(వెయ్యింటికి ధరలు)	కొత్తవి:	పాతవి
విజయవాడ:	160 00	122 00
రాజమండ్రి	145 00	195 00
పాలకొల్లు	165 00	190 00

పసుపు

దుగ్గిరాలలో:	కొమ్ములు	రు. 128 50
"	కాన్పూరు	140 00
"	దుంపలు	117 00
కడపలో	కొమ్ములు	136 00
"	దుంపలు	—

జనపనార

విజయనగరం:	మొదటిరకం	66 98
	రెండవరకం	61 62
	మూడవరకం	56 26

క్రొత్తవీమంచివే: పాతవీమంచివే:
క్రొత్త బట్టలు మంచివేగా :
మరిపాతవియ్యమో: అవీమంచివే:
పాతవిషయాలను విడిచిపెట్టకుండ
క్రొత్త విషయాలను అందించి
అందర్నీ ఆనందపరచే
శ్రీ గిరిజా గైడ్సు
అన్నిటికన్నా మంచివి :
"శ్రీగిరిజాగైడ్స్" 3, 4, 5 తరగతులకు
అన్ని సబ్జక్టులతో వెలువడినాయి :
SUVARNA

విజయవంతమైన
14 వ వారం
శ్రీకృష్ణా .... రాజమండ్రి
2 వ వారం
హరిహరమహల్ ... గుంటూరు

గీతాంజలివారి
కొహరా
31-7-64 నుండి మ్యాటినీతో
పూర్ణా ... వైజాగ్
పూర్ణా ప్రొడక్షన్స్ రిలీజ్.
SUVARNA

గవర్నమెంట్ లక్కీ టికెట్

11-8-64 వ తేదీన డ్రా జరిగే ఈ ప్రభుత్వ రాఫిల్ టికెట్లు కొనువారికి, ఏడున్నర.లక్షల రూపాయల ప్రథమ బహుమతితో సహా లక్కీ ప్రైజులు, గిఫ్ట్ ప్రైజులు మరియు కన్సొలేషన్ ప్రైజులు దాదాపు 3,600 బహుమతులు రిజర్వు చేయబడినవి. పెక్కు బహుమతు లున్నందున ఈ లాటరీలో మీరు చేరినట్లయితే. భగవంతుని దయవల్ల అదంతా మీ మంచికోసమే. గుర్తుంచుకోండి. మీ పవిత్రమయిన డబ్బు పొందగల లాటరీ టికెట్ ఇదొక్కటి మాత్రమే. టికెట్ ధర, పూర్తి టికెట్ రు. 10 లకు వాటాల హక్కుతో అర టికెట్ వెల రు. 5/- వంతున పెంచబడినది. అర టికెట్ వాటాల హక్కును కొన్నవారు బహుమతి మొత్తం సగం వంతు పొందుతారు. టికెట్ ధర వెంటనే మనీ ఆర్డర్ ద్వారా పంపుతూ, ఎం. ఒ. కూపన్‌పై మీరు చిరునామా స్పష్టంగా పేర్కొన్నట్టయితే, పూర్తి వివరములతో మీకు టికెట్ పంపించబడును. టికెట్ ధర పంపవలసిన చిరునామా :

మేనేజర్, కేరళ జనరల్ ఏజన్సీస్, కొచ్చిన్-2





దగ్గును అశ్రద్ధ చేయవద్దు
ఆధారపడదగినది
బి.ఐ. కాఫ్ సిరప్
● దగను మాన్పుతుంది
● గుండె, నాళాల్లో కఫమును పలచబరుస్తుంది.
● శ్వాసను సులభపరుస్తుంది.
● ఈ మందు ఇతర వ్యాధులకు దారితీయదు.
బెంగాల్ ఇమ్యూనిటీవారి వస్తువు.
అనుమానరహితంగా సత్వర నివారిణి

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరు బలరామమూర్తి తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు. స్వతంత్ర అచ్చు ప్రింటర్స్, విజయవాడ-4.